క్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక
శుక్రవారం, జూన్ 26, 2026 | సంపుటి - 20 | సంచిక 272 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

## అభివృద్ధిని ఓర్వేలకపోతున్న బావాబామ్మర్దులు

## ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్

హైదరాబాద్ : ఇందిరా గాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశ గానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

2లో






# తుంగభద్రానదికి 33 కొత్త గేట్లు

### రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు

### మూడు రాష్ట్రాల సిఎంలు కలసి ప్రారంభం

### కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్

### ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్

బళ్లారి : కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ 2లో

# జల వివాదాలను పరిష్కరించుకుందాం

## పంచాయితీలు కాదు... పరిష్కారాలు ముఖ్యం



### తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి

### మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి

### కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి

### తుంగభద్రలో 15 టిఎంసిలకు 5 టిఎంసిలే అందుతున్నాయి

### మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

బళ్లారి : తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 2లో



# వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

### సాయం అందిస్తామని ప్రకటన

### సాయం కోసం సిద్దంగా ఉన్నామన్న ట్రంప్

న్యూఢిల్లీ : వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి

# ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

### రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశాం

### ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..అప్పులు చేసి ఇస్తున్నాం

### పదివేల కోట్లు నష్టం వచ్చినా పంటలు కొనుగోలు చేశాం

### సిఎం సభావేదికను పరిశీలించిన మంత్రి తుమ్మల



ఖమ్మం : ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. జులై నెల లోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. తరువాయి 2లో



# వెనిజువెలాను వణికించిన వరుస భూకంపాలు

## 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు

### నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు

### ప్రాథమిక సమచారం మేరకు 32 మంది మృతి

### దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు

### అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్



కారకాస్ : వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని తరువాయి 2లో

# సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

### కాంగ్రెస్ క్యాడర్ బూత్ విడిచి వెళ్లవద్దు

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ : సర్‌పై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నేతలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సర్ ప్రక్రియను కాంగ్రెస్ క్యాడర్ అధిగమించాలని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నేతలు అంతా ఈప్రక్రియను పరిశీలించాలన్నారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. తరువాయి 2లో

# ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

### జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్

### యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ

### సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడ


అమరావతి : నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమి విప్లవం'కు శ్రీకారం చుట్టనున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్రంలోని స్థానిక యువత ప్రతిభను ప్రోత్సాహించడంతో పాటు.. యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహేలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. గురువారం సచివాలయంలో మంత్రిని జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఐ ఆధారిత ఫిల్మ్ మేకింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 24 క్రాఫ్ట్స్ శిక్షణకు సంబంధించి జాడెక్స్ సంస్థ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. సినీ, మీడియా రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

## వాటిని పరిరక్షిస్తేనే భవిష్యత్

### గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలి

### నెలల్లో 33 గేట్ల పునరుద్ధరించాం : సీఎం చంద్రబాబు




బళ్లారి,జూన్25 : దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్టు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు.రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగు నీరు.. మరికొన్ని ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు తుంగభద్ర అని వ్యాఖ్యానించారు. తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్టు అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్టు నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో తుంగభద్ర ప్రాజెక్టు 33 గేట్ల పునరుద్ధరించామని వివరించారు. తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. 2లో

# పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

న్యూఢిల్లీ : కేంద్రం తాజాగా పాస్‌పోర్టు ఫీజులను పెంచింది. కొత్త ఫీజులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రకటన ప్రకారం, 18 ఏళ్లు పైబడిన వారు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) లేదా పాస్‌పోర్టు రీఇష్యూ కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.1,500గా ఉండేది. ఇక తత్కాల్ పథకం కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారి ఫీజు రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెరిగింది. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజు కూడా రూ.2 వేల నుంచి రూ.3,500కు పెరిగింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఇకపై రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4 వేలుగా ఉండేది. పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) కోసం ఇకపై రూ.5 వేలు చెల్లించాలి.

# ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

# వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.

# ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తు న్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తు న్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు.

# సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

నెల రోజుల పాటు బీఎల్‌వోలు బూత్‌ను విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ప్రతి పది బూత్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక సూపర్‌వైజర్‌ను పెడుతున్నామన్నారు. బీఎల్‌వోలతో నాయకులు నిరంతరం టచ్‌లో ఉండి.. సర్ జరిగే విధానాన్ని పరిశీలించాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 36 వేలకు పైగా పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఏలను నియమించామని తెలిపారు. ఎస్.ఐ.ఆర్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. బిహార్‌లో 76 లక్షల ఓట్లు, పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని.. ఆ రెండు రాష్ట్రాల్లోన్రూ బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కేరళలో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుగానే అలర్ట్ కావడంతో కాపాడుకోగలిగామని ఎంపీ వెల్లడించారు. ఇప్పుడు తెలంగాణలోనూ అదే జరగబోతోందన్నారు. నెల రోజుల పాటు జరిగే సర్ పక్రియలో బీఎల్‌వోలు మూడు సార్లు ఇంటికి వచ్చే ప్రయత్నం చేస్తారన్నారు. తెలంగాణలో ఇప్పటికే 1 కోటి 2 లక్షల ఓట్లను అన్‌మ్యాప్ చేశారని.. అంటే దాదాపు 33 శాతం ఓట్లు అన్‌మ్యాప్ అయ్యాయని తెలిపారు. బీఎల్‌వోలు అప్రమత్తంగా లేకపోతే కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లు కూడా తొలగిపోయే అవకాశం ఉందన్నారు. 2002 ఓటర్ లిస్ట్, 2025 ఓటర్ లిస్ట్, అన్‌మ్యాప్ ఓటర్ లిస్ట్‌ను దగ్గర పెట్టుకుని పరిశీలించాలని సూచించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై విచారణ

**స్పీకర్ తీర్పు కాపీలను సమర్పించాలని హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్,జూన్25 : పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది.

# జల వివాదాలను పరిష్కరించుకుందాం

3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పిల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

# వెనిజువెలాను వణికించిన వరుస భూకంపాలు

వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది. మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది లోపలే ఓ ఫుడ్ కౌంటర్ వద్ద ఆశ్రయం పొందారు. మొత్తం దుమ్ముతో నిండిపోతున్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండిపోయారు. తీరప్రాంత నగరమైన లాగువైరాకు సంబంధించిన మరో వీడియో వెలుగులోకి వచ్చింది. వరుస భూకంపాలతో కూలిపోయిన భవనాలు, గాలిలోని దుమ్ము, నిర్మానుష్యంగా మారిన రహదారులు ఆ వీడియోలో కనిపించాయి. వెనెజువెలా రాజధాని కారకాస్‌లోనూ భారీ విధ్వంసం జరిగింది. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. స్థానికులు ప్రాణభయంతో కేకలు వేసిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. మరో వీడియోలో ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కల ప్రాణాలు కాపాడిన దృశ్యాలు కనిపించాయి. కూలిపోయిన తమ ఇంటి నుంచి అతి కష్టం మీద కుటుంబ సభ్యులను కాపాడుకున్నాడు బాధితుడు. ఆ తర్వాత తన రెండు కుక్కలనూ ప్రాణాలతో బయటకు తీసుకువచ్చాడు.ఇలాంటి అనేక వీడియోలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోవైపు జంట భూకంపాల అనంతరం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## భూకంపాలపై గూగుల్ ముందే హెచ్చరికలు

**స్టార్ట్ ఫోన్లకు అలర్ట్‌లు పంపిన గూగుల్**

**సోషల్ మీడియాలో స్క్రీన్ షాట్లు ప్రత్యక్షం**

కారకస్,జూన్25 : వందేళ్లలోనే ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తుతో వెనెజువెలా దేశం అల్లాడిపోతోంది. వరుసగా రెండు శక్తిమంతమైన భూకంపాల ధాటికి అనేక భవనాలు నేలమట్టమై లక్షలాది మంది ప్రజలు వీధినపడ్డారు. కాగా.. ఈ భూకంపాలు సంభవించడానికి కొన్ని క్షణాల ముందు గూగుల్ పలు స్మార్ట్‌ఫోన్లకు దీని గురించి అలర్ట్‌లు పంపించినట్లు తాజాగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్లను నెటిజన్లు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ అలర్ట్‌లు వచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత కాసేపటికే భూకంపాలు సంభవించాయి. అధునాతన స్మార్ట్‌ఫోన్లలో యాక్సిలరోమీటర్ అనే పరికరం ఉంది. సాధారణంగా ఇది ఒక సెన్సార్. మీరు ఫోన్‌ను అడ్డంగా పట్టుకున్నప్పుడు స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా తిప్పుతుంది. అయితే, దీని వల్ల మరో ఉపయోగం కూడా ఉంది. ఈ సెన్సార్ కంపనాలను కూడా గుర్తించి కొలవగలదు. మనం ఉంటున్న ప్రాంతంలో భూమి నుంచి వెలువడే వైబ్రేషన్స్‌ను ఇది సేకరిస్తుంది. ఇవి భూకంపానికి దారితీసేంత బలంగా ఉంటే.. వెంటనే గూగుల్ ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్‌కు సిగ్నల్ పంపిస్తుంది. సుమారుగా ఏ ప్రాంతంలో భూకంపం వచ్చే అవకాశం ఉందో కూడా చెబుతుంది. ఒక స్మార్ట్‌ఫోన్ నుంచి ఈ సిగ్నల్ అందిన వెంటనే.. గూగుల్ సర్వర్ ఆ ప్రాంతంలోని మిగతా ఫోన్లలోని యాక్సిలరోమీటర్లను పరిశీలిస్తుంది. అత్యధిక ఫోన్లు ఇలాంటి ప్రకంపనలే గుర్తిస్తే.. వెంటనే భూకంపం వస్తుందని అంచనా వేసి ఆ ప్రాంతానికి అలర్ట్స్ పంపిస్తుంది. ఈ పక్రియ శరవేగంగా జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ ఫీచర్ ఉన్నట్లు గూగుల్ తెలిపింది. సాధారణంగా భూకంపం అనేది ఒక్కసారిగా వచ్చే కుదుపు కాదు. తరంగాల రూపంలో సంభవిస్తుంది. తొలుత ప్రైమరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు ఆరు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆ తర్వాత సెకండరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు 3-4 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి. భూకంపం వల్ల జరిగే అత్యధిక నష్టానికి ఈ తరంగాలే కారణం. ఇక, మన స్మార్ట్‌ఫోన్లు గుర్తించేవి ప్రైమరీ వేవ్స్‌నే. ఇవి రాగానే సర్వర్‌కు సిగ్నల్ ఇస్తాయి. అందువల్ల.. సెకండరీ వేవ్స్ రావడానికి ముందే గూగుల్ సర్వర్లు సమాచారాన్ని సేకరించి అలర్ట్ ఇవ్వడానికి సమయం లభిస్తుందని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు. భూకంప తీవ్రతను అంచనా వేసినదాని బట్టి.. ఆండ్రాయిడ్ ఫోన్లు రెండు రకాల అలర్ట్‌లు ఇస్తుంటాయి. ఒకటి 'బి అవేర్ అలర్ట్'. ఇది తక్కువ తీవ్రతతో ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఇచ్చే సిగ్నల్. ఇక రెండోది 'టేక్ యాక్షన్ అలర్ట్'. మధ్యస్త, తీవ్ర స్థాయి భూకంపాల సమయంలో దీనిని జారీ చేస్తుంటుంది. దీన్ని టచ్ చేయగా.. భూకంపం వచ్చే అవకాశం ఉన్న పరిధిని చూపిస్తుంది. దీంతో పాటు విపత్తు సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో తెలిపే కొన్ని సూచనలు చేస్తుంది. మన దేశంలోనూ 2023 నుంచి ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ యాక్టివ్‌లో ఉంది. ఆండ్రాయిడ్ 5 అంతకంటే ఆధునిక వెర్షన్లలో ఈ ఫీచర్ ఉంది. అయితే, అలర్ట్‌లు రావాలంటే తప్పనిసరిగా ఫోన్‌లో మొబైల్ డేటా లేదా వైఫై ఆన్ చేసి ఉండాలి. ఒకవేళ ఈ అలర్ట్‌లు వద్దనుకునేవారు.. డివైజ్ సెట్టింగ్స్‌లో ఎర్త్‌క్వేక్/ఎమర్జెన్సీ అలర్ట్స్‌ను ఆఫ్ చేసుకోవచ్చు.

## జాతీయ సెలవు దినం కావడంతో ప్రజలంతా ఇంటివద్దే

**ప్రాణనష్టం భారీగా ఉండొచ్చంటున్న యూఎస్ జియలాజికల్ సర్వే**

**ప్రజలు ఇళ్లను వదిలి బయటకు రావాలని పిలుపు**

కారకాస్,జూన్25 : వెనెజువెలా దేశాన్ని వరుసగా రెండు భూకంపాలు వణికించాయి. ఈ ప్రకృతి విపత్తు తీవ్రత ధాటికి దేశ రాజధానిలో తీవ్ర నష్టం వాటిల్లింది. పలు బహుళ అంతస్తు భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయి ఉండొచ్చని, దాంతో భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ భూకంపాల తర్వాత బలమైన ప్రకంపనలు రావొచ్చు. దాంతో ఈ విపత్తు విధ్వంసకరంగా ఉండొచ్చు. భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది. మృతుల సంఖ్య 10వేల నుంచి లక్ష వరకు ఉండవచ్చని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ప్రస్తుతానికి వెనెజువెలా ప్రభుత్వం మృతుల సంఖ్యపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. భూకంపాల ధాటికి గాయపడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉందని స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. ఇళ్లను వదిలి బయటకు వచ్చేయాలంటూ భూకంపాల ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెనెజువెలా ప్రభుత్వం సూచించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లకున్న పెట్రోల్ సరఫరాను కట్ చేసినట్లు వెల్లడించింది. కొన్ని భవనాలు కూలిపోయాయని, మరింత నష్టం వాటిల్లకుండా ఈ చర్యలని పేర్కొంది. జూన్ 24.. వెనెజువెలాలో నేషనల్ హాలిడే. దాంతో మిగతా రోజులతో పోలిస్తే.. ఎక్కువమంది ఇళ్లలోనే ఉన్నారు. బుధవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో తొలి భూకంపం వచ్చింది. దాంతో భూమి కంపించినప్పుడు భారీగా ప్రజలు బయటకు పరిగెత్తిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణనష్ట తీవ్రత పెరగడానికి ఈ హాలిడే కూడా ఒక బలమైన కారణం కావొచ్చని అధికారులు చెప్తున్నారు.

# ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని చంద్రబాబు అభివర్ణించారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. ప్రాజెక్టులు బాగుంటేనే భవిష్యత్తు తరాలకు భరోసా ఉంటుందని చెప్పారు. తుంగభద్ర.. మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర తాగు, సాగు నీరు ఇచ్చింది. ఈ నది లేకపోతే చాలా సమస్యలు వచ్చేవి. జలవనరుల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలో నదుల అనుసంధానం చేయాల్సిన బాధ్యత ఉంది. గంగ, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారత్ అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తుంది. సీఆర్ పాటిల్‌కు నదులు అనుసంధానం చేసిన అనుభవం ఉంది. జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరిని కేంద్రం అనుసంధానం చేయాలని చంద్రబాబు అన్నారు. ఇకపోతే కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చరిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతుల కోసం తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర అని తెలిపారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, తాను చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మూడు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు.

పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

తత్కాల్ స్కీమ్‌లో బుక్ చేసుకుంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో ఈ ఫీజులు వరుసుగా రూ.6 వేలు, రూ.8,500 వేలకు పెరిగాయి. 18 ఏళ్ల పిల్లలకు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) ఫీజు రూ.1,750గా నిర్ణయించింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టు కోసం ఇకపై రూ.4,250 చెల్లించాల్సి ఉంటుంది. మైనర్లు పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు కోసం రూ.4,250, తత్కాల్ స్కీమ్ కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంటే రూ.6,750 చెల్లించాల్సి ఉంటుంది. మేరకు విదేశాంగ శాఖ పాస్‌పోర్టు నిబంధనలకు మార్పులు చేసింది. 2012లో చివరిసారిగా కేంద్రం పాస్‌పోర్టు ఫీజులను సవరించింది. సాధారణ విధానంలో దరఖాస్తు చేసుకుంటే 45 రోజుల్లోపు పాస్‌పోర్టు జారీ అవుతుందన్న విషయం తెలిసిందే. తత్కాల్ విధానంలో ఇంతకంటే త్వరగా పాస్‌పోర్టు పొందే అవకాశం ఉంది.

# ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్ల బదిలీ

**గ్రేటర్ హైదరాబాద్ డీసీగా శ్రీనివాస్‌రెడ్డి**

హైదరాబాద్,జూన్25 : రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్లుగా పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జె హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండలో డీసీగా పనిచేస్తున్న ఏ శ్రీనివాస్‌రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా బదిలీ చేశారు. రంగారెడ్డి డీసీగా ఉన్న దశరథను టీజీబీసీఎల్ డీసీగా, ఖమ్మంలో డీసీగా ఉన్న జనార్దన్ రెడ్డి ఆదిలాబాద్ డీసీగా బదిలీ చేశారు. టీజీబీసీఎల్ ఆర్‌ఆర్-1లో ఉన్న దాతురాజు గౌడ్‌ను వరంగల్ డీసీగా, నిజామాబాద్‌లో ఏసీగా ఉన్న వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా, కరీంనగర్ బీసీఎల్‌లో మేనేజర్‌గా ఉన్న రవీకుమార్‌ను కరీంనగర్ డీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లేబుల్స్‌లో పనిచేస్తున్న పి శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా, హెడ్‌క్వార్టర్స్‌లో డీసీగా ఉన్న కె రఘురాంను రంగారెడ్డి డీసీగా, హైదరాబాద్ ఏసీగా ఉన్న ఏ అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో ఏసీగా ఉన్న పి ప్రణవిని మల్కాజిగిరి డీసీగా, మహబూబ్ నగర్ ఏసీ విజయ్ భాస్కర్ రెడ్డి డీసీ అక్కడే పదోన్నతి కల్పించింది. బ్రేవరీస్‌లో ఏసీగా ఉన్న చంద్రయ్యను మెదక్ డీసీగా, ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న సీవీ శశిధర్ రెడ్డిని నల్గొండ డీసీగా బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది.

# సికింద్రాబాద్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్,జూన్25 : సికింద్రాబాద్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్వప్నలోక్ కాంప్లెక్స్ పక్కన ఉన్న సూర్య కిరణ్ బిల్డింగ్ మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం నుంచి పొగ, మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా భవనంలోని పలు అంతస్తులు పొగతో నిండిపోయాయి. భవనంలో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తరలించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో భవనంలో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ

### ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'

### నిర్జల ఏకాదశి పర్వదినంతో కర్రపూజ నిర్వహించిన ఉత్సవ కమిటీ

హైదరాబాద్,జూన్25 : ఖైరతాబాద్ బడా గణేశుడి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. హైదరాబాద్ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సాంప్రదాయబద్ధంగా కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 69 అడుగుల భారీ విగ్రహం నమూనా పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆవిష్కరించింది. ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా ఖైరతాబాద్ గణేశుడు దర్శనమివ్వనున్నాడు. విగ్రహానికి ఓ వైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళీమాత విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ జరగనుంది. ఈ ఏడాదితో ఖైరతాబాద్‌లో బడా గణేశుడి ఉత్సవాలు ప్రారంభమై 72 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ పూజా కార్యక్రమం అనంతరం స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ ఏడాది కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. రాబోయే వినాయక చవితి పండుగ నాటికి, అంటే కేవలం 82 రోజుల్లోనే అన్ని హంగులతో కూడిన 70 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు సమసిపోయి, శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈ సారి ఖైరతాబాద్ గణేశుడిని 'పంచముఖ సంకట హార మహా గణపతి' రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ భారీ విగ్రహానికి కుడి వైపున ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని, ఎడమ వైపున భక్తులను రక్షించే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. లోకకల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.

## ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు

### బకాయిలపై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

### ప్రైవేట్ యాజమాన్యాలకు స్వల్ప ఊరట

హైదరాబాద్,జూన్25 : తెలంగాణ హైకోర్టు లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ హైకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదు. మీరు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూలు చేయొద్దంటే కళాశాలను వారు ఎలా నడుపుతారు? రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బ్జడెట్ కేటాయించారు?పెండింగ్ బకాయిలు ఎప్పటిలోపు చెల్లిస్తారు?' అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ ఆగస్ట్ 15లోపు బకాయిలు చెల్లిస్తామని బదులిచ్చారు. అలా జరిగితే తమ పిటిషన్లు కూడా వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల తరఫు న్యాయవాది చెప్పారు. ఇదే అంశంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అటు ప్రభుత్వం, ఇటు కళాశాలల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారన్నారు. ఈ బకాయిలతో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. మంగళవారం అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పారు. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి ఉన్నత న్యాయస్థానం వాయిదా వేసింది.

గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

## కొనసాగుతున్న సహాయక చర్యలు..సిఎం పర్యవేక్షణ

కోల్‌కతా,జూన్25 : మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

## జూలైలో అమరావతి ఆస్పత్రి పనులు

### ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వెల్లడి

అమరావతి,జూన్25 : ంహైదరాబాద్‌లో బసవతారకం ఆస్పత్రి ఇంకా విస్తరణ జరుగుతుందని ఆ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. అమరావతిలో కూడా బసవతారకం ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాలయ్య నటిస్తున్న112వ సినిమా అమరావతిలో గురువారం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది.

# ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్

### ఒక్క రూపాయి భారం లేకుండా రూ కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా

### విమాన ప్రమాదమైతే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు రక్షణ

### కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు

### దేశ చరిత్రలోనే తొలిసారి ..త్వరలోనే 'క్యాష్‌లెస్' హెల్త్ కార్డ్స్

### ఒకటో తేదీనే జీతాలు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,జూన్25 : తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా.. నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ (ఈఎంఐలు) కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది. మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి గారు 'ఉద్యోగుల హక్కులను కాపాడాలి' అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డుల సమస్యకు ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ద్వారా ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్‌లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, దీనివల్ల ఆరోగ్య భద్రత మరింత మెరుగవుతుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల ఉచిత వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ ద్వారా రూ. 1,11,116 ఆర్థిక సాయం వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సంక్షేమ ఫలాలను చిట్టచివరి లబ్ధిదారునికి చేర్చడంలో డెలివరీ మెకానిజంగా ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తున్నారని, అందుకే వారి కుటుంబ సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం తన బాధ్యతగా తీసుకుందని కొనియాడారు. ఈ బీమా పథకం నమోదుకు ముందుకు వచ్చిన బ్యాంకర్లకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సుదూర విజన్‌కు అనుగుణంగా, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు, బ్యాంకర్లు, ప్రభుత్వం సమష్టిగా, చేయి చేయి కలిపి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎ రేవంత్ రెడ ÷–డి, మంత్రులు పొన్నంప్రభాకర్, పొంగులేటి, అజారుద్దీన్, వివేక, సిఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు

### ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా

### వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..కార్యకర్తలకు కెటిఆర్ భరోసా

వికారాబాద్,జూన్25 : వచ్చే ఐదేళ్లు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా..అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రభుత్వం లేదు.. పవర్ లేదు కానీ గర్వంగా ఎక్కడనిపిస్తుందంటే ఎమ్మెల్యే పోయినా.. ఎంపీ పోయినా.. అధికారం పోయినా ఇంతమంది సోదరులు ఇక్కడికొచ్చి మీరు చేస్తున్న ప్రకటన మామూలు ప్రకటన కాదు.. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీ గుండెల్లో రైళ్లను ఉరికించే గొప్ప దృశ్యం ఇక్కడ కనిపిస్తుందని చేవెళ్ల సమావేశాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీ అందరికీ తెలుసు మనకు అధికారం పోయి రెండున్నరేళ్లయింది. ఎన్నికల ముందేమో నేను గుంపు మేస్త్రీని. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని ఫోజులు కొట్టిండు. ఇవాళ రియల్ ఎస్టేట్‌ను ఏం చేసిండు మరి.. బొంద పెట్టిండు.. వంద ఫీట్ల అడుగులో పాతిపెట్టే పని చేసిండని మండిపడ్డారు. మన ప్రభుత్వం, పెద్దలు కేసీఆర్ ఉన్నప్పుడు షాబాద్‌లో చందన్ వెల్లిలోకానీ, సీతారాంపూర్‌లో కానీ ఎకరం 30 లక్షలుండేది. కానీ అక్కడ ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్క్ తీసుకొచ్చిన తర్వాత అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఒక మెక్రోసాఫ్ట్, అమెజాన్ వెల్స్‌ఫన్ ఇతర కంపెనీలు తీసుకొచ్చిన తర్వాత నేడు ఎకరం 3 కోట్లకు తక్కువ షాబాద్‌లో లేని పరిస్థితి ఉంది. అదే రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత లక్షల మంది రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి పనిచేసుకునే తమ్ముళ్లు, చె÷–లలెల్లందరూ ఇవాళ దివాళా తీసే పరిస్థితి వచ్చిందన్నారు. వాస్తవేంటంటే ఎన్నికలకు ముందు ఎకరం కోటి రూపాయలు పలికింది కూడా ఇవాళ కనీసం రూ.50 లక్షలు, రూ.60 లక్షలకు కూడా కొనేందుకు ఎవరూ సిద్దంగా లేరన్నారు. దారుణమైన పరిస్థితి ఉంది. ఎందుకీ పరిస్థితి ఉందనేది మనం ఆలోచన చేసుకోవాల్సి ఉందని కేటీఆర్ గుర్తు చేశారు.

## నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

### పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?

నల్గొండ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా(38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి తరచూ ఇంటికి వచ్చి సుల్తాన్ గొడవ పెట్టుకునేవారని స్థానికులు చెబుతున్నారు. వీరి కుమారుడు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. హసీనా ఓ ప్రైవేటుపాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె అఫోర ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సుల్తాన్ మొదటి భార్య మృతిచెందింది. హసీనాతో రెండో వివాహం కాగా ఇప్పుడున్న పిల్లలిద్దరూ సుల్తాన్ మొదటి భార్య పిల్లలని స్థానికులు చెబుతున్నారు.

## కర్నాటక ప్రాజెక్టులతో మరణశాసనమే

### పాలమూరుకు చుక్కనీరు కూడా రాదు

### మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ ఆందోళన

మహబూబ్‌నగర్,జూన్25 : కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు మరణ శాసనం కానుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్డీఎస్‌పై కృష్ణ పరివాహక ప్రాంతంలో ఆయా ప్రాంత రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తాము మాట్లాడుతున్నది అవాస్తవం కాదని అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ఎత్తివేతకు హెలికాప్టర్‌లో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అక్రమా ప్రాజెక్టులు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌కు వంద మీటర్ల దూరంలోనే కర్ణాటక ప్రభుత్వం లిఫ్ట్ పనులు మొదలు పెట్టిందని, వీటితోపాటు మరో రెండు రోడ్ కమ్ బ్యారేజులు కడుతుందని ఆరోపించారు.

## రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా

### కోటి ప్రమాద బీమా పథకం ప్రారంభం

### రవీంద్రభారతి వేదికగా బీమాపథకం ప్రారంభించిన సిఎం రేవంత్

హైదరాబాద్,జూన్25 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ.1 కోటి ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని సీఎం పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బీమా పథకాన్ని గురువారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, ప్రమాద బీమా పథకాన్ని తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించామన్నారు. 45 మంది కార్మికుల కుటుంబాలకు బీమా సాయం అందించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ఉద్యోగుల సమస్యలు, వారి అవసరాలు తనకు బాగా తెలుసని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికీ భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. మంత్రివర్గానికీ తానే మేస్త్రీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని, రేవంతన్నగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. పదవులు, హోదాలు మారొచ్చుగానీ ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. అలాగే గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులు ప్రమాదంలో చనిపోతే కోటిన్నర బీమా ఇస్తామని ప్రకటించిన సీఎం.. ఆదిశగా ముందడుగు వేశారు. బ్యాంకులను ఒప్పించి బీమా ఎంఓయూపై సంతకం చేశారు.ఈ బీమాతో 15 లక్షల మంది రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు లబ్ది చేకూరనుంది. పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈ బీమా వర్తించనుంది. తొలుత సింగరేణి సంస్థలో ఈ బీమాను ప్రారంభించారు. ఇప్పటికే 45 మంది సింగరేణి కార్మికులు చనిపోతే కోటిన్నర బీమా చెల్లించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు కోటిన్నర బీమా అమలులో డిప్యూటీసీఎం భట్టి కృషి ఎంతో ఉందన్నారు. ఉద్యోగులంతా ప్రభుత్వంలో కుటుంబ సభ్యులు.. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొలుత ఈ బీమా అమలుపై అనేక సందేహాలున్నా.. తర్వాత ఉద్యోగులకు సంక్షేమమే లక్ష్యంగా ఎంతో కసరత్తు చేశామన్నారు. బ్యాంకర్లను ఒప్పించి ఈ బీమాను కల్పించామన్నారు సీఎం. మరోవైపు విమాన ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు రూ.3కోట్ల బీమా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా రోజుకు ఒక గంట అదనంగా పని చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొందరు పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాక్స్ బకాయిలను కఠినంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, గతంలో 11 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.5 శాతానికి తగ్గించగలిగామని వివరించారు. రాష్ట్రంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం మండిపడ్డారు. 'మూసీ నది పునరుజ్జీవనం చేద్దామంటే నా కాళ్లలో కట్టెలు పెడుతున్నారు. రీజనల్ రింగ్ రోడ్డు చేపడితే తప్పా? మెట్రో విస్తరణ చేద్దామన్నా, ఆర్ఆర్ఆర్ తెస్తామన్నా వద్దే వద్దని అడ్డుపడుతున్నారు. తమకు ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంది, పోతే ఏంది అనే రీతిలో బీఆర్ఎస్ నేతలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు' అని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బస్సు యాత్రలు సిగ్గుచేటు

### లంబాడాలను ఎస్టీల నుంచి తొలగించే కుట్ర

### లంబాడాలకు, ఆదివాసీలకు మధ్య చిచ్చు పెట్టే యత్నం

### సిఎం రేవంత్ రెడ్డిపై మాజీమంత్రి సత్యవతి రాథోడ్ విమర్శలు

హైదరాబాద్,జూన్25 : ఎస్టీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ బస్సు యాత్రలు చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రేవంత్ రెడ్డి ఆదివాసీలతో సుప్రీంకోర్టులో కేసు వేయించారు. లంబాడాలకు, ఆదివాసీలకు మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి లంబాడాలు కర్రు కాల్చి వాతలు పెట్టడం ఖాయమన్నారు.ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. అంగన్‌వాడీల రిక్రూట్ మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి తెరలేపింది అని మాజీ మంత్రి విమర్శించారు. గురువారం ఆమె తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అంగన్ వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. అంగన్‌వాడీలకు కేసీఆర్ ప్రభుత్వం పీఆర్సీ ఇచ్చిందన్నారు. ప్రతిసంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కలెక్టర్లు ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారు. అంగన్‌వాడీ రిక్రూట్ మెంట్ కు ఇచ్చిన కొత్త జీఓను మార్చాలన్నారు. మినీ అంగన్ వాడీలను కేసీఆర్ ప్రభుత్వం హయాంలో అప్ గ్రేడ్ చేశాం. మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క మేము అప్ గ్రేడ్ చేసిన వాటిని మరోసారి మినీ అంగన్ వాడీలను అప్ గ్రేడ్ చేస్తూ తొలి సంతకం పెట్టారని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు వారికి జీతాలు ఇవ్వడం లేదు. అంగన్ వాడీ వ్యవస్థను అవినీతి మయం చేశారని మండిపడ్డారు. అంగన్ వాడీ టీచర్లకు రూ.13,650 జీతం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పారదర్శకంగా అంగన్ వాడీ నియామకాలు జరిగాయని, కాంగ్రెస్ పార్టీ వారి కార్యకర్తలకు దోచిపెట్టాలని చూస్తున్నదని మండిపడ్డారు. దీంతో అర్హులు అంగన్ వాడీ ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం !

ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద  చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్-ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్-ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత ర్గి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

## బుల్డోజర్ న్యాయం.. ఎన్నాళ్లిలా?



ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వేలాదిమందిని జైళ్లకు వెళ్లి నెలల తరబడి గడిపాము. అయితే, నేడు ఎటువంటి విచారణ, నేరారోపణ లేకుండానే వేలాదిమందిని కేవలం భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినందుకు, నిరసన తెలిపినందుకు ఏదో ఒక సాకుతో జైళ్లకు పంపుతున్నారు. అధికార పక్షం 'వాషింగ్ మెషిన్'గా మారిపోయింది. వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడినట్లు స్వయంగా ఆరోపించిన నేతలనే పార్టీ ఫిరాయించి తమతో చేరగానే వారిపై కేసులు మాఫీ చేయడమే కాకుండా వారికి కీలక పదవులు కట్టబెడుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వం మారగానే ఇటీవల కోల్‌కతా అంతటా జరిగిన కూల్చివేతల పరంపర ఎమెర్జెన్సీ నాటి దారుణమైన రోజులను గుర్తుకు తెచ్చింది. సీల్దా, హౌరా, దమ్ దమ్, జాదవ్‌పూర్, ఇతర ప్రాంతాలలో తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, విక్రయ దారులు, మురికివాడల నివాసితుల జీవనోపాధిని నాశనం చేసింది. అధికారులు 'అభివృద్ధి', 'సుందరీకరణ' అని పిలిచేది, వాస్తవానికి, శ్రామిక కుటుంబాలు దశాబ్దాలుగా చెమటోడ్చి నిర్మించుకున్న ఇళ్లను, వ్యాపారాలను రాత్రికి రాత్రే కూల్చివేయడమే. మే 16-17 తేదీల రాత్రి, రైల్వే అధికారులు, భద్రతా దళాలు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సీల్దా స్టేషన్‌లో ని కియోస్కులు, స్టాల్స్‌ను కూల్చివేశారు. ప్రవేశ పరీక్షా.. ప్రయాస పరీక్షా? ఎమర్జెన్సీని ప్రకటించి 51 సంవత్సరాలు గడిచినా, భారతదేశం తన ప్రజాస్వామ్య చరిత్రలోని అత్యంత వివాదాస్పద అధ్యాయాలలో ఒకదానిపై చర్చను కొనసాగిస్తోంది. ఆ చర్చ సమంజసమే కావచ్చు. ఎమర్జెన్సీ పరిశీలన, విమర్శ, చారిత్రక పరిశీలనకు అర్హమైనది. అయితే, ప్రజలు, చరిత్ర రెండూ ఎప్పుడో తీర్పు వెలువరించిన ఒక చారిత్రక సంఘటనగా కాకుండా, భారతీయ జనతా పార్టీ దీనిని ఒక సమకాలీన రాజకీయ సమస్యగా ఎందుకు పరిగణిస్తూనే ఉందనేది అంత సులభంగా అర్థం కాని విషయం. వాస్తవానికి, భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇటీవల వెనకడుగు వేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అప్రకటిత ఎమర్జెన్సీని విధించింది బిజెపియే. రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం, మీడియా యాజమాన్యంలోని ఒక పెద్ద విభాగంపై ఉక్కుపిడికిలి బిగించడం, ఆశ్రితపెట్టుబడిదారీ విధానం, సంస్థల గొంతు నొక్కడం, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం - ఇవన్నీ ఎమర్జెన్సీ లక్షణాలు, ఇవి ఇప్పటికీ అమలులో ఉన్నాయి. కాంగ్రెస్ సమకాలీకులలో చాలామంది కూడా, ఎమర్జెన్సీ గురించి లోతుగా పరిశోధించడానికి లేదా చర్చించడానికి తరచుగా ఇబ్బందిపడతారు. ఎమర్జెన్సీ దోషరహితమైనదని కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ వాదించలేదు. దశాబ్దాలుగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌లతో సహా దాని అగ్ర నాయకత్వం, ఆ కాలంలో జరిగిన దురాగతాలను బహిరంగంగా అంగీకరించింది. ఇందిరా గాంధీ స్వయంగా 1977లో ఎన్నికలు నిర్వహించి ప్రజల తీర్పును కోరారు. ఓడిపోయినప్పుడు ఓటర్ల తీర్పును అంగీకరించారు. ఆమె స్వయంగా మరో వేయేళ్లు వరకు దేశంలో ఎమర్జెన్సీ విధించే పరిస్థితి రాదనీ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నాయకత్వం చరిత్రలోని ఆ అధ్యాయం పట్ల పదేపదే విచారం వ్యక్తం చేసింది. అయినప్పటికీ, ప్రతి సంవత్సరం, ముఖ్యంగా జూన్ 25వ తేదీ చుట్టూ, బిజెపి ఎమర్జెన్సీని ఒక రాజకీయ ఆయుధంగా పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తుంది. దీని ఉద్దేశం చారిత్రక పరిశీలన కాదు. ఇది ఒక రాజకీయ సమీకరణ. సుస్థిర పాలన ఆమడ దూరం తన వర్తమానంపై విశ్వాసం ఉన్న ప్రభుత్వం, తన పరిపాలన ద్వారా ప్రజల మెప్పు పొందగలమని ఆత్మవిశ్వాసం గల ప్రభుత్వం, దాదాపు అర్ధ శతాబ్దం క్రితం ఉనికిలో లేకుండాపోయిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేయవలసిన అవసరం ఉండదు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వం మారగానే ఇటీవల కోల్‌కతా అంతటా జరిగిన కూల్చివేతల పరంపర ఎమెర్జెన్సీ నాటి దారుణమైన రోజులను గుర్తుకు తెచ్చింది. సీల్దా, హౌరా, దమ్ దమ్, జాదవ్‌పూర్, ఇతర ప్రాంతాలలో తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, విక్రయదారులు, మురికివాడల నివాసితుల జీవనోపాధిని నాశనం చేసింది. అధికారులు 'అభివృద్ధి', 'సుందరీకరణ' అని పిలిచేది, వాస్తవానికి, శ్రామిక కుటుంబాలు దశాబ్దాలుగా చెమటోడ్చి నిర్మించుకున్న ఇళ్లను, వ్యాపారాలను రాత్రికి రాత్రే కూల్చివేయడమే. మే 16- 17 తేదీల రాత్రి, రైల్వే అధికారులు, భద్రతా దళాలు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సీల్దా స్టేషన్‌లోని కియోస్కులు, స్టాల్స్‌ను కూల్చివేశారు. ఇదే తరహా చర్యలు మే 16న హౌరాలో, మే 31 రాత్రి దమ్ దమ్ జంక్షన్‌లో, జూన్ 7- 8 తేదీల రాత్రి జాదవ్‌పూర్‌లో జరిగాయి. జాదవ్‌పూర్‌లో, వీధి వ్యాపారులు, విద్యార్థులు, కార్మిక సంఘాల కార్యకర్తలు బుల్డోజర్ల ముందు శాంతియుతంగా కూర్చున్నప్పుడు, వారిపై లాఠీచార్జీలు,అరెస్టులు జరిగాయి. వృద్ధ వీధి వ్యాపారులు తమ జీవితపు ఆనవాళ్ల కోసం శిథిలాలలో వెతుక్కోవాల్సి వచ్చింది. కార్మికులకు సంఘీభావం తెలిపినందుకు విద్యార్థులు, కార్యకర్తలను కొట్టారు. ప్రభావిత వర్గాలు చర్చలకు వెళ్ళినప్పుడు, వారిని పట్టించుకోలేదు. వారి డిమాండ్ చాలా సరళమైనది: 'పునరాభివృద్ధి' జరగాలంటే, పునరావాసం ముందుగా జరగాలి. ఆ డిమాండ్‌కు ఈ రోజు వరకు సమాధానం రాలేదు. కోల్‌కతాలో జరుగుతున్న దానిని జాతీయ సందర్భంలో అర్థం చేసుకోవాలి. వార్తాపత్రిక చందా భారతదేశ వ్యాప్తంగా, బిజెపి 'బుల్డోజర్'ను రాజకీయ అధికారాన్ని, దుర్వినియోగాన్ని ప్రదర్శించే ఒక ప్రధాన సాధనంగా మార్చుకుంది.

## పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

**ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి**
**72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర**
**బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా**

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా-ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి. అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి (ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ.2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్  సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి.


## ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**బహుభార్యత్వం కూడా సమర్థనీయమే**
**మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు**
**తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు**

ముంబై,జూన్25 : మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్-ఎ-హసన్, తలాక్-ఎ-అహ్సన్, తలాక్-ఎ-బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

## వివేకవం ఉంటే రాణించవచ్చు !

తిరుమల : మనిషి ధనవంతుడే కావచ్చు, విద్యావంతుడే కావచ్చు, సర్వాంగ సుందరుడే కావచ్చు కాని బుద్ధిమంతుడు కాకపోతే ఆ ధనం, విద్య, సౌందర్యం ఎందుకూ కొరగావు. బుద్ధిమంతుడు అంటే ఏకసంథాగ్రాహి, మహామేధావి అని కాదు- సద్బుద్ధి కలవాడని అర్థం. సద్బుద్ధి అంటే వివేకంతో కూడిన బుద్ధిశక్తి. మంచీచెడుల మధ్య తేడా తెలియడమే వివేకం. మనిషికి బుద్ధిశక్తి ఉన్నా వివేకం లేకపోతే అది వక్రమార్గం పడుతుంది. మనిషికి గొప్ప తెలివితేటలు లేకపోయినా పెద్దగా ఇబ్బంది లేదు కాని దుర్బుద్ధి ఉంటే చాలా ప్రమాదకరం. మనిషి ఎదిగినా, దిగజారినా, పేరు ప్రఖ్యాతులు గడించినా, అపఖ్యాతి మూటకట్టుకున్నా- అదంతా బుద్ధి మహిమే. ఇహపరాలు రెండూ బుద్ధి చేతుల్లోనే ఉంటాయి. సద్బుద్ధి ఉంటే మంచి స్నేహితులు, శీల సంపద, గౌరవ మర్యాదలు, సత్సంబంధాలు, మనోనిర్మలత, ఆత్మవివేచన కలిగి ఉంటారు. దుర్బుద్ధి ఉంటే కపటత్వం, అసూయాద్వేషం, అసహనాలు ఆవరిస్తాయి. మనిషి దేహాంగాలన్నీ దివ్యంగా పనిచేస్తున్నా, బుద్ధి ఒక్కటి వక్రంగా పనిచేస్తే చాలు- జీవితం పతనమవుతుంది.



ఆధ్యాత్మికం

# కరీంనగర్ ప్రజలకు కన్నీళ్లా...?

## విలీన గ్రామాల కుంటలకు, చెరువులకు రక్షణేది

### ● సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, జూన్25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్‌లో ఉన్న నీటిని ప్రక్క జిల్లాలకు తరలించి కరీంనగర్ ప్రజలు త్రాగునీటికి కష్టాలను,కన్నీళ్లను చవిచూడాల్సి వస్తుందని, కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లోని చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నా అధికారులు పాటించుకోవడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. నగరంలో త్రాగునీటి ఎద్దడిని నివారించాలని, విలీన గ్రామాల కుంటలు, చెరువులను కాపాడాలని గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగిందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. త్రాగునీటి కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ఖాళీ బిందెలతో విన్నూతనంగా నిరసన తెలపడానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు.నాయకులకు పోలీసులకు కొద్దిసేపు తోపులాట జరిగింది. అనంతరం సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తలాపున నీళ్ళున్నా చాప దూపకు ఏడ్చినట్టు కరీంనగర్ లో మానేరు డ్యామ్ ఉన్నప్పటికీ ప్రజలు త్రాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఎండా కాలంలో ప్రజలకు నీరందక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్ల లల్లో నీరు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, నగర వ్యాపితంగా ఎటు చూసినా,ఏ డివిజన్‌కు వెళ్లినా ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీరు కొనుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రధాన కారణం అధికారులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వక పోవడమేనని, స్థానిక ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్.పార్టీ, స్థానిక ఎంపీ బి. జె. పి పార్టీ, అటు కాంగ్రెస్ పార్టీకి ప్రజాప్రతినిధి లేకపోవడం ఇలా నాయకుల ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడం అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం వారికి సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడమేనని, కరీంనగర్ ప్రజల దాహార్తి తీర్చే నాధుడే కరువయ్యాడని శ్రీనివాస్ ఆరోపించారు. ఇటీవలి కాలంలో మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లోని చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని, రియల్ ఎస్టేట్ వారు వాటిని కబ్జాలు చేస్తున్నారని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నారని, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని కొరవడిందని,ఇప్పటికైనా అటు మున్సిపల్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు నగర ప్రజల త్రాగునీటి కష్టాలను, భూముల కబ్జాలను నిలువరించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన మరిన్ని పోరాటాలు నిర్వహించక తప్పదని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ






నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, మచ్చ రమేష్, శాఖ కార్యదర్శులు బాకం ఆంజనేయులు, గామినేని సత్యం చెంచల మురళి, నగునూరి రమేష్, కాల్వ శ్రీనివాస్, ఈ.భారతి, కేంసారం శ్రీనివాస్, అల్లేపు రాజు, నునావత్ శ్రీనివాస్, మామిడిపల్లి హేమంత్ కుమార్, మమత, స్రవంతి, దానవేణి రమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రహిత తెలంగాణే లక్ష్యం: పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి

### ● మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** గంజాయి రహిత తెలంగాణే లక్ష్యమని పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్, గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై గోదావరిఖనిలోని ఉప్పర సంఘం ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకతీయ జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకమైన మలుపని, ప్రతి వ్యక్తి సమాజంలో మంచి గుర్తింపు, గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్ల కారణంగా తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేయకూడదని అన్నారు. డ్రగ్స్ వినియోగం లేదా అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే 100 లేదా 1908 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థానాలను చేరుకొని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా వ్యసనాలు మరియు ఇతర అనారోగ్యకర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి ఆసక్తి కారణంగా వ్యసనాలకు లోనైతే భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షిస్తూ విద్యను అందిస్తున్నారని, వారి ఆశయాలను నెరవేర్చే విధంగా విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అధికంగా సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల విద్యార్థుల దృష్టి చదువుల నుంచి మరలిపోయే






అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ లేకుండా కొంత సమయం కూడా ఉండలేని పరిస్థితి వ్యసనానికి సంకేతమని అన్నారు. సోషల్ మీడియా రీల్స్, అనవసర చాటింగ్ వంటి వాటిపై సమయాన్ని వృథా చేయకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ ఐలు మనోహర్, అనూష, వివిధ కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల బాధితులు సాధారణ జీవితం గడపాలి

### ● పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి ● ప్రభుత్వ ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ సందర్శన

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మత్తు పదార్థాల బాధితులు తిరిగి సాధారణ జీవితం గడపాలని పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన బాధితులను తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడం, వారి మానసిక స్థితి, ప్రవర్తనలో సానుకూల మార్పులు తీసుకురావడం లక్ష్యంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌ను పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలు, చికిత్స పురోగతి గురించి వైద్యులు, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వ్యక్తులు తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా అవసరమైన వైద్య, మానసిక, సామాజిక సహాయాన్ని అందించేందుకు పోలీసులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చికిత్స పొందుతున్న బాధితుల కాలక్షేపం, మానసిక ఉల్లాసం, ఆలోచనా విధానంలో సానుకూల మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో అందించిన క్యారమ్ బోర్డులు, చెస్ బోర్డులు తదితర ఆటవస్తువులను పంపిణీ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల




వ్యసనం నుంచి పూర్తిగా బయటపడేందుకు వైద్య చికిత్సతో పాటు మానసిక ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారం, సమాజం నుంచి నిరంతర మద్దతు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. వ్యసనానికి గురైన వారిని చిన్నచూపు చూడకుండా, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

## పోచంపల్లిలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

**మానకొండూర్, జూన్ 25(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లిలో కాంగ్రెస్ గ్రామ శాఖాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్ ఆద్వర్యంలో ఇటీవల లబ్ధిపొందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఇల్లు లేని ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయం పొందాలని లబ్ధిదారులను దాసరి శ్రీనివాస్ యాదవ్ కోరారు.కొన్న శ్రీనివాస్ రెడ్డి, గోపు రవీందర్ రెడ్డి,పిల్లి ఐలయ్య, పాలకవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సహజంగా శరీరంలో కొలెస్ట్రాల్ కరిగించే ఆహారాలు ఇవే..

నేటి కాలంలో అనేక మంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ ప్రాథమికంగా ఒక రకమైన లిపిడ్. శరీరానికి అవసరమైన విధులు నిర్వర్తించడానికి ఇది చాలా అవసరం. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ అనే రెండు రకాల కొలెస్ట్రాల్ ఉంటాయి.చెడుకొలెస్ట్రాల్ లేదా మొత్తం పెరిగినప్పుడు అనేక సమస్యలు వస్తాయి.ఈ కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని ఆహారాలు తీసుకోవాలి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది ఓట్ మీల్ తింటున్నారు. ఇందులో కొలెస్ట్రాల్‌ను కరిగించి నియంత్రించడంలో సహాయపడే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇందులో మోనోశాచురేటెడ్ కొవ్వు కూడా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పండ్లు కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. యాపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి రోజూ యాపిల్స్ తప్పక తినాలి. రెడ్ మీట్,ఫాస్ట్‌ఫుడ్,జంక్ ఫుడ్‌వంటి ఆహారాలను పూర్తిగామానుకోవాలి.అవికొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. అలాగే, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కేకులు, కుకీలు, పేస్ట్రీలు, జున్ను, నెయ్యి, వెన్న, చీజ్, జామ్ వంటి వాటికి కూడా దూరంగా ఉండాలి. మీగడ పాలు, దానితో చేసిన ఆహారం, నెయ్యి-వెన్న వీలైనంత తక్కువగా తీసుకోవాలి. అలాగే తగినంత నీళ్లుత్రాగాలి.దానితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరి. సరైన ఆహారాల అలవాట్లు సగం జబ్బులను నయం చేస్తుంది.

## పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి





**సుల్తానాబాద్, జూన్ 25(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గం సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మతల్లి ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు మరియు అర్చనలు నిర్వహించారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు వచ్చిన భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఎలిగేడులో ఘనంగా శ్రీ మడిలేశ్వర స్వామి బోనాలు

### స్వామివారిని దర్శించుకున్న బీజేపీ నేత నల్ల మనోహర్ రెడ్డి



**సుల్తానాబాద్, జూన్ 25 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గం, ఎలిగేడు మండల కేంద్రంలో శ్రీ మడిలేశ్వర స్వామి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భారతీయ జనతా పార్టీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు మరియు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రజలమధ్య ఐక్యతను,భక్తిభావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఆలయ అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శుభకార్యాలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ





**కరీంనగర్ టౌన్, జూన్25(ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ లోని జన్వాడ కె కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుని వివాహానికి టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు అందజేశారు. మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతనాగరాజు కుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో డా.కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని శుభాశీస్సులు అందజేశారు.వీణవంక మండలం చల్లూరులో జరిగిన తమ స్వగ్రామం పచ్చునూరుకు చెందిన కనకం అశోక్ కుమార్తె వివాహానికి మానకొండూర్ ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయన సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మానకొండూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరిగిన వివాహాది శుభకార్యాలకు డాక్టర్ దంపతులు హాజరయ్యారు.

# "అప్పు"డే మందు బస్తాల వేట మొదలాయే..!

● యూరియాకు తోడు కాంప్లెక్స్ కూడా! ● యాప్‌లో బస్తాలు... షాపులో కష్టాలు... ● ఒకే పేరు.. వేర్వేరు ఊర్లు.. ● బుకింగ్ యాప్ తో గందరగోళం. ది క్రైమ్ న్యూస్ ప్రత్యేక కథనం...




**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** నిన్నటిదాకా యూరియా బస్తాల కోసం రైతులు పడిన పాట్లు రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. చెప్పుల లైన్లు... పాస్‌బుక్ జిరాక్స్‌ల క్యూలు... రోజుల తరబడి గోదాముల దగ్గర పడిగాపులు... చివరకు ఒక్క బస్తా దొరుకుతుందో లేదో అనే అనుమానం. అయినా రైతన్న ఎలాగోలా పంట కాలాన్ని గట్టెక్కించాడు.

గత ఏడాది ఎదురైన ఆ చేదు అనుభవాలు ఇంకా రైతుల మనసుల్లో సజీవంగానే ఉన్నాయి. పంటకు అవసరమైన సమయంలో ఎరువు దొరకక పొలంలో నిలబడి నిస్సహాయంగా చూసిన రోజుల్ని ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. అందుకే ఈసారి చినుకు పడక ముందే... గింజ నేలను తాకక ముందే... మందు బస్తాల వేట మొదలుపెట్టేశారు.

రైతుల కష్టాలను తగ్గిస్తామని ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా యాప్ వ్యవస్థను తీసుకొచ్చింది. కానీ రైతుల బాధలు తగ్గాయా అంటే... సమాధానం మాత్రం ప్రశ్నగానే మిగిలిపోయింది. ఒక సమస్యకు పరిష్కారం చూపాలనుకొని మరో సమస్యను రైతు మెడకు తగిలించినట్టుగా పరిస్థితి తయారైంది.

చదువురాని రైతు యాప్‌లోకి వెళ్లి బస్తాలు ఎలా బుక్ చేసుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నాడు. చాలామంది తమ గ్రామంలో ఉన్న యువకులను, పరిచయస్తులను బ్రతిమిలాడుకుని బుకింగ్ చేయించుకుంటున్నారు. అయితే ఇక్కడే మరో కొత్త సమస్య రైతును వెంటాడుతోంది.

ఒకే పేరుతో లేదా దగ్గర దగ్గర పేర్లతో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలు రైతులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఉదాహరణకు "లక్ష్మీ ఫర్టిలైజర్స్" అని వెతికితే తన ఊరిలో ఉన్న షాప్ అనుకుని, వాస్తవానికి దూర ప్రాంతంలో ఉన్న అదే పేరున్న దుకాణాన్ని ఎంపిక చేస్తున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయి.

అలాగే "లక్ష్మీ ఫర్టిలైజర్స్", "లక్కీ ఫర్టిలైజర్స్" వంటి పేర్లు ఒకేలా కనిపించడంతో పొరపాట్లు జరుగుతున్నాయి. బుకింగ్ పూర్తయ్యాక తీరా చూస్తే అది తమ గ్రామం కాదని, పది కిలోమీటర్లు కాదు... కొన్ని సందర్భాల్లో పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్న దుకాణమని తెలిసి రైతులు నెత్తినోరు బాదుకుంటున్నారు.

తన ఊరిలోని ఎరువుల దుకాణంలో కళ్ల ముందే బస్తాలు కనిపిస్తున్నా... యాప్‌లో ఆ షాపు పేరు కనిపించడం లేదని తలపట్టుకుంటున్నాడు. బస్తాలు పక్కనే ఉన్నా... యాప్ చెబితేనే కొనాలట. రైతన్నకు ఇది కొత్త వ్యవసాయ సాంకేతికత కాదుగానీ, కొత్త తలనొప్పి మాత్రం ఖచ్చితంగా అయింది.

గత ఏడాది యూరియా కోసం పడ్డ కష్టాలు జీవితకాలం గుర్తుండిపోయే మధుర స్మృతులుగా మిగిలిపోవడంతో ఈసారి ముందుగానే దండయాత్ర మొదలుపెట్టాడు. అనుకున్న సమయానికి ఎరువు దొరకక పడిన అగచాట్లు మళ్లీ ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ముందస్తు యుద్ధానికి సిద్ధమయ్యాడు.

అధికారులు మాత్రం సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావని భరోసా ఇస్తున్నారు. నాయకులు కూడా యూరియా సరఫరాలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వేదికల మీద గొప్పలు చెబుతున్నారు. ఆ మాటలు వింటున్న రైతన్న మాత్రం ఆశ్చర్యంతో నోరెళ్లబెడుతున్నాడు. ఎందుకంటే గత ఏడాది తాను పడ్డ కష్టాలన్నీ గుర్తుకొస్తున్నాయి. గంటల తరబడి క్యూల్లో నిలబడటం... షాపుల చుట్టూ తిరగడం... దొరుకుతుందో లేదో అన్న టెన్షన్‌తో రోజులు గడపడం... ఇవన్నీ దేశానికే ఆదర్శమైతే, నిజంగా గర్వపడాల్సిందేనని వ్యంగ్యంగా నవ్వుకుంటున్నాడు. ఇప్పటికే యూరియా బస్తాల కోసం పడిన ఇబ్బందులు చాలవన్నట్టు, ఈసారి కాంప్లెక్స్ ఎరువులు కూడా అదే బాట పట్టే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం రైతుల్లో కొత్త ఆందోళనకు కారణమవుతోంది.

మొన్నటిదాకా ఒక్క యూరియాతోనే సతమతమైన రైతు, ఇప్పుడు కాంప్లెక్స్ ఎరువుల కోసం కూడా యాప్‌లు, క్యూలు, వెతుకులాటలు తప్పవేమోనని భయపడుతున్నాడు.
అదీ కాక ధరలు కూడా చుక్కలనంటుతున్నాయి. ఒకవైపు ఎరువులు దొరకాలంటే కష్టాలు... మరోవైపు దొరికితే ధరలు భయపెడుతున్నాయి. దీంతో రైతు పరిస్థితి ముందు నుయ్యి... వెనుక గొయ్యి అన్నట్టుగా తయారైంది.

అయినా ప్రభుత్వం రైతును రాజును చేస్తామని చెబుతోంది. నిజంగానే రైతును రాజును చేయాలంటే ఇలాంటి పరీక్షలు తప్పవేమో అని కొందరు రైతులు నవ్వుకుంటున్నారు. ఎందుకంటే రాజు అయ్యే ముందు యుద్ధాలు గెలవాలి కదా! అందుకే బహుశా ప్రభుత్వం రైతులకు ప్రతీ సీజన్‌లో కొత్త కొత్త పరీక్షలు పెడుతుందేమో అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.
ఒకప్పుడు రైతు పంట పండించడానికి కష్టపడేవాడు. ఇప్పుడు పంటకు అవసరమైన ఎరువులు సంపాదించుకోవడానికే ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది.
ఒకప్పుడు షాపుల్లో దొరికే బస్తాలు ఇప్పుడు యాప్‌ల్లో వెతకాల్సిన పరిస్థితి వచ్చింది.
మారింది టెక్నాలజీ మాత్రమే... రైతు కష్టం మాత్రం యథాతథంగానే ఉంది.
ఒకటి పోయిందని చెప్పుకుంటే రెండోది కూడా మాయమైనట్టు... నిన్నటిదాకా యూరియా బస్తాల కోసం పడిన అగచాట్లు చాలవన్నట్టు, ఇప్పుడు కాంప్లెక్స్ ఎరువులు కూడా అదే దారిలో నడుస్తాయేమోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. అందుకే రైతన్న ఇప్పుడు ఒక్కటే అంటున్నాడు...
"దేశానికే ఆదర్శమైన సరఫరా ఉంటే...
నాకు ఒక్క బస్తా కోసం ఈ వెతుకులాట ఎందుకు?"అని.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

## ● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓ జిల్లా కలెక్టర్‌కు వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఫారమ్‌లో వివరాలు నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ, ఫారమ్‌ల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్నికల సంఘానికి క్షేత్రస్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, వారి పని తీరుపైనే ఈ కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగు నుంచి ఐదు రోజులలోపు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫారమ్‌లను అందజేసే సమయంలో వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలని చెప్పారు. ఫారమ్‌లు సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారమ్‌లు స్వయంగా నింపలేని వారికి బీఎల్ఓలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందేలా చూడాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఫారమ్ పంపిణీ జరిగినట్లు రసీదు లేదా ఇతర ఆధారాలు భద్రపరచుకోవాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో ఇప్పటికే పేరు ఉన్న అర్హులైన ఓటర్ల నుంచి ఈ దశలో ఎలాంటి సహాయక పత్రాలు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలు ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ఫారమ్‌లు ఇవ్వని వారి పేర్లు జాబితాలో కనిపించకపోవచ్చని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసం మారిన వారు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. ఇతర నియోజక వర్గాల్లో ఓటర్లుగా ఉన్నవారిని ఫారమ్-8 ద్వారా ఓటు బదిలీ చేయించే చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి అర్హుడికి ఫారమ్-6 అందించి కొత్త ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు మరణించినట్లు, నివాసం మార్చుకున్నట్లు లేదా అక్కడ నివసించడం లేదని సమాచారం వచ్చినప్పుడు తగిన ఆధారాలు, స్థానికుల వాంగ్మూలాలు నమోదు చేయాలని, సరైన ధృవీకరణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, నిష్పాక్షికత తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు, రాజకీయ పార్టీల బీఎల్ఏలు రాబోయే మూడు నెలలపాటు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుని చేరుకుని వారి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఈఆర్వోలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఫారమ్‌ల పంపిణీ నుంచి సేకరణ వరకు ప్రతి దశలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బీఎల్ఓలు తమ సాధారణ విధులతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎస్ఐఆర్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జై గౌడ్ ఉద్యమం పాతర్లపాడు గ్రామ కమిటీ ఎన్నిక






**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** మండలంలో పాతర్లపాడు గ్రామములో బుధవారం రోజున జరిగిన జై గౌడ్ ఉద్యమం కార్యకర్తల సమావేశం జై గౌడ్ ఉద్యమం జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కా రవీందర్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం ముఖ్య అధితులుగా జై గౌడ్ ఉద్యమం జిల్లా అధ్యక్షులు పొలంపల్లి నాగరాజు గౌడ్, సర్ధార్ సర్వాయి పాపన్న అవార్డు గ్రహీత డాక్టర్ తోడేటి దుర్గ ప్రసాద్ గౌడ్, జై గౌడ్ ఉద్యమం ఖమ్మం టౌన్ అధ్యక్షులు బంధం హనుమంతు రావు గౌడ్, గ్రామ సర్పంచ్ సుస్మా రమేష్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్ గౌడ్ హాజరైనారు. వారు ప్రసంగిస్తూ గౌడులు అందరు ఐక్యంగా వుండాలిని అన్నారు. గౌడ బిడ్డలు విద్య, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా రంగాలలో ముందు ఉండాలని పిలిపినిచ్చారు. తాటి చెట్టు మీద నుండి ప్రమాదశాత్తు క్రింద పడినవారికి ప్రభుత్వం నుండి వచ్చే ఎక్సగ్రెస్ యను, అర్హులైన గౌడ బిడ్డలకు సభ్యత్వాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జై గౌడ్ ఉద్యమం తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడుగా మల్లారపు శ్రీధర్ గౌడ్ ను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం జై గౌడ్ ఉద్యమం గ్రామ కమిటి మరియు యూత్ కమిటి ఎన్నుకోవడం జరిగింది. జై గౌడ్ ఉద్యమం గ్రామ అధ్యక్షులుగా కోసూరి సునీల్ కుమార్ గౌడ్, ఉప అధ్యక్షుడుగా గమిని రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గమిని మహేష్ గౌడ్, కోశాధికారిగా మల్లారపు రవి కుమార్ గౌడ్, సభ్యులుగా మల్లారపు బుచ్చయ్య గౌడ్, జడల నగేష్ గౌడ్, దొంతగాని ఉ ప్పయ్య గౌడ్, మక్కా నరేష్ గౌడ్, లింగాల మధు గౌడ్, బొమ్మిన వెంకన్న గౌడ్, మక్కా శివాజీ గౌడ్, నారటి భాస్కర్ గౌడ్, గమిని రామచంద్రు గౌడ్, మక్కా సురేష్ గౌడ్, దొంతగాని శ్రీశైలం గౌడ్, మల్లారపు మల్లేష్ గౌడ్ ఎన్నుకోవడం జరిగింది. జై గౌడ్ ఉద్యమం గ్రామ కమిటీకి గౌరవ సలహాదారులుగా ఆలుదాసు రంగయ్య గౌడ్, తాళ్ల సర్వయ్య గౌడ్ నియమితులైనారు. జై గౌడ్ ఉద్యమం గ్రామ యూత్ అధ్యక్షుడుగా జడల శరత్ గౌడ్, చీకటి వినోద్ గౌడ్, పొన్నం విజయ్ గౌడ్, కత్తి రాకేష్ గౌడ్, మల్లారపు బాలకృష్ణ గౌడ్, చామకూరి వినోద్ గౌడ్, మక్కా రమేష్ గౌడ్, నారటి బాలకృష్ణ గౌడ్, పాసినేని సతీష్ గౌడ్, పాసినేని సంతోష్ గౌడ్ ఎన్నుకోవడం జరిగినది. యూత్ కమిటీకి గౌరవ సలహాదారుడిగా చీకటి శ్రీను గౌడ్ నియమితులైనారు. ఈ కార్యక్రమంలో మద్దెల వెంకటరమణ గౌడ్, మల్లారపు రామనర్సయ్య గౌడ్, మల్లారపు బిక్షం గౌడ్, జడల వెంకటనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉన్నత విద్యా మండలిలో భావోద్వేగ వీడ్కోలు

## వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్‌కు ఘన సన్మానం







**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్ పదవీకాలం ముగిసిన సందర్భంగా ఈరోజు ఆయనకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి అధికారులు, సిబ్బంది సభ్యులు ప్రొఫెసర్ మహమూద్‌తో తమ అనుబంధాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. టీజీసీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉన్నత విద్యారంగంలో సంస్కరణలకు ప్రొఫెసర్ మహమూద్ అందించిన సేవలను ప్రశంసించారు. ముఖ్యంగా డిగ్రీ విద్యార్థుల కోసం పాఠ్యాంశాల పునర్వ్యవస్థీకరణ, నూతన విద్యా కార్యక్రమాల ప్రవేశపెట్టడంలో ఆయన చూపిన పట్టుదల, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈ. పురుషోత్తం మాట్లాడుతూ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా పనిచేసిన రోజుల నుంచే ప్రొఫెసర్ మహమూద్‌తో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసిన సమయంలో సామాజిక న్యాయం, విద్యార్థి సంక్షేమం, విద్యార్థి కేంద్రిత కార్యక్రమాల పట్ల ఆయన కనబరిచిన నిబద్ధతను కొనియాడారు. టీజీసీహెచ్ఈ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ మాట్లాడుతూ, పరిశోధన మరియు ఆవిష్కరణల సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రొఫెసర్ మహమూద్ చేసిన కృషిని ప్రశంసించారు. మండలి సిబ్బంది సభ్యులు కూడా తమ విధుల నిర్వహణలో ప్రొఫెసర్ మహమూద్ అందించిన మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అందించిన సత్కారానికి స్పందించిన ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, చైర్మన్‌తో పాటు సహచరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను ప్రపంచ జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో భవిష్యత్తులోనూ తన వంతు కృషిని కొనసాగిస్తానని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకు పైగా సాగిన తన అధ్యాపక, విద్యా పరిపాలనా ప్రస్థానం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, టీజీసీహెచ్ఈ లక్ష్యాల సాధనలో అంకితభావంతో పనిచేసిన సిబ్బంది సభ్యులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం ముగింపులో ప్రొఫెసర్ మహమూద్‌ను టీజీసీహెచ్ఈ చైర్మన్, అధికారులు మరియు సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

# పాదాల్లో కనిపించే ఈ లక్షణాలు.. గుండెపోటుకు సంకేతం కావొచ్చు..

ఇటీవల గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతోన్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. చిన్న వయసు వారు కూడా గుండె పోటుకు గురికావడం అందరినీ కలవరపెడుతోంది. అయితే గుండె జబ్బులను త్వరగా గుర్తించి, చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తుంటారు. పలు రకాల లక్షణాల ఆధారంగా గుండెపోటును ముందుగానే గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి ఓ లక్షణం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. శరీరంలో కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎలివేటెడ్ కొలెస్ట్రాల్, కాళ్ల వాపు గుండె జబ్బుకు ప్రాథమిక సంకేతాలుగా నిపుణులు చెబుతున్నారు. కాళ్లలో వాపు గుండె వైఫల్యానికి సంకేతంగా నిపుణులు చెబుతున్నారు. రక్తప్రసరణలో సమస్యలు కూడా గుండె వైఫల్యానికి కారణమ తెలిసిందే. రక్త ప్రసరణలో సమస్య ఉంటే.. పాదాలలో నీరు నిండుతుంది. దీంతో ఇది పాదం వాపునకు దారి తీస్తుంది. అందుకే కాళ్లలో వాపు గుండె జబ్బుకు ప్రాథమిక సంకేతంగా చెబుతుంటారు. అందుకే కాళ్లు వాపునకు గురైతే ఎట్టి పరిస్థితుల్లో లైట్ తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది అనేక తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని చెబుతున్నారు. పాదాలు, చీలమండలు, పొత్తికడుపు వాపు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాళ్లు, పాదాలలో వాపును పెరిఫెరల్ ఎడెమా అంటారు. దీంతో కాళ్లు బరువుగా ఉంటాయి. చర్మంలో కూడా వాపు లక్షణాలు కనిపిస్తాయి. బూట్లు ధరించడంలో ఇబ్బంది ఉంటుంది. అలాగే వాపు కూడా పాదాలు వేడిగా, గట్టిగా మారడానికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ చిట్కాలు పాటించాలి..చెడు కొలెస్ట్రాల్ పెరుగుదల గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తుందని తెలిసిందే. అలాంటి పరిస్థితిలో, తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయిల్ ఫుడ్‌ను వీలైనంత వరకు తగ్గించాలి. ప్రతీ రోజూ కచ్చితంగా వ్యాయామం చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలి. తీసుకునే ఆహారంలో ఉప్పును పూర్తిగా తగ్గించాలి. శరీరంలో సోడియం పరిమాణం పెరిగితే అది వాపునకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో సమయాన్ని వృథా చేయకుండా వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు.

# పచ్చునూర్‌లో న్యూమరేషన్ ఫారం స్వీకరించిన ఎమ్మెల్యే దంపతులు



**కరీంనగర్ టౌన్, జూన్25(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ తన స్వగ్రామం పచ్చునూరులో గురువారం ఎనిమరేషన్ పారాన్ని అధికారుల నుంచి తీసుకున్నారు. పచ్చునూరు ,గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (సర్) నిర్వహించిన సందర్భంగా ఆయన తన సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధతో కలిసి ఎంఆర్వో, బీఎల్ఏలు, బీఎల్‌వోల నుంచి ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడు భాగస్వామి కావాలని, తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన బాధ్యతను గుర్తించి ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం అధికారులు, బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కార్యక్రమం నిర్వహణపై వివరాలు తెలుసుకుని, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

## • పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి • విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్, రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలో రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎసఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విశ్వభారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరిస్తేనే డ్రగ్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యా లక్ష్యాన్ని విజయవంతంగా సాధించి మంచి ఫలితాలు సాధిస్తే, అది తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు కూడా గర్వకారణమవుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా తీవ్ర నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంత ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఎవరైనా మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నటు లేదా వాటి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇందుకోసం అత్యవసర సహాయ సంఖ్య 100 లేదా సంబంధిత హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై జరుగుతున్న పోరాటంలో చురుకైన భాగస్వామిగా ఉంటానని, డ్రగ్స్‌కు దూరంగా ఉండే జీవన విధానాన్ని అనుసరిస్తానని, చుట్టూ ఉన్న ఎవరూ మాదకద్రవ్యాల ప్రభావానికి లోనుకాకుండా చూసేందుకు కృషి చేస్తానని, డ్రగ్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామిగా ఉండేందుకు అంకితభావంతో పనిచేస్తానని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వభారతి స్కూల్స్ డైరెక్టర్ యాదగిరి గౌడ్, నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతి గౌడ్, సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ జోసెఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ మున్సిపల్ నిధులతో ప్రహారీ గోడ నిర్మాణం

## • ఘనంగా శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ టౌన్, జూన్25(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నూతన ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్థానిక కార్పొరేటర్ టింకు, కార్పొరేటర్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా నగర మేయర్, సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మున్సిపల్ నిధులతో ఈ ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను మరింత సురక్షితంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్మాణం దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ పోలీస్ శాఖకు, మున్సిపల్ కార్పొరేషన్‌కు మధ్య ఇదే రకమైన సమన్వయం కొనసాగుతుందని స్పష్టం చేశారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం, నిరంతరం రోడ్లపై ఉంటూ ఎండ, ధూళిని లెక్కచేయక విధి నిర్వహణలో నిమగ్నమయ్యే ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టారు. సిబ్బంది కంటి ఆరోగ్య రక్షణకై సీపీ గౌష్ ఆలం చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి చలువ కళ్ళజోళ్లను అందజేశారు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా విధి నిర్వహణకు కట్టుబడి పనిచేస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు సంజీవ్, అంజయ్య, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఆగస్టు మొదటివారం నాటికి యాతాలకుంట

## • టన్నెల్ పనులు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో కీలక భాగమైన యాతాలకుంట టన్నెల్ నిర్మాణం, లైనింగ్ పనులను ఆగస్టు మొదటివారం నాటికి పూర్తిచేసి గోదావరి జలాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం సత్తుపల్లి మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సందర్శించారు. టన్నెల్ లోపలికి నడుచుకుంటూ వెళ్లి పనుల పురోగతి, లైనింగ్ నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ చర్యలను పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి పనుల వేగంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను ఆగస్టు మొదటివారం నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. యాతాలకుంట టన్నెల్ పూర్తి కావడం ద్వారా సత్తుపల్లి ట్రంక్ కాలువకు గోదావరి జలాలు చేరి సత్తుపల్లి నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం కలుగుతుందని తెలిపారు. టన్నెల్ పూర్తయిన వెంటనే రుద్రాక్షపల్లి, బేతుపల్లి ప్రాంతాలతో పాటు ఎన్టీఆర్ ప్రధాన కాలువకు నీటి సరఫరా సులభతరం అవుతుందని తెలిపారు. రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలించి ఆయకట్టు రైతులకు నీటి కొరత లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా వ్యవసాయాభివృద్ధికి విశేష అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. యాతాలకుంట టన్నెల్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అదనంగా సుమారు లక్ష ఎకరాలకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. దీంతో రైతులు పంటలు సాగు చేసే అవకాశం కలుగుతుందని, వ్యవసాయ ఉత్పాదకతతో పాటు రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. టన్నెల్ నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని, మరింత వేగంపెంచి మిగిలిన లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. రెండు వైపులా అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల అమలులో ఎదురయ్యే సాంకేతిక, పరిపాలనా లేదా ఇతర సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువు దాటకుండా పనులు పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలానికే గోదావరి జలాలు బేతుపల్లి చెరువు, సత్తుపల్లి ఆయకట్టు ప్రాంతాలకు చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పనులను మరింత వేగవంతం చేసి ఆగస్టు లోపల పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించాలని సూచించారు. టన్నెల్ నిర్మాణ సమయంలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పనుల ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా, చీఫ్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. కృష్ణ, ఇంజినీరింగ్ సిబ్బంది, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కారాగారం

**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కారాగారం, ఖమ్మంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం ఏసీపీ శ్రీ రామనమూర్తి, అర్బన్ సి.ఐ భానుప్రకాష్ హాజరై ఖైదీలను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజిక దుష్పరిణామాల గురించి వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కారాగార సిబ్బంది మరియు ఖైదీలతో కలిసి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి శ్రీధర్, జైలర్ సక్రూ, డిప్యూటీ జైలర్ హనుమంతరావు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కండె వెంకటేశ్వర రావు పాల్గొని ఖైదీలకు అవగాహన కల్పించారు. జిల్లా కారాగారంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కారాగార అధికారులు, సిబ్బంది మరియు ఖైదీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్‌లో పాల్గొని పర్యవేక్షించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

## మ్యాపింగ్ కాని ఓటర్లు కొత్త ఓటర్లను నమోదు చేపించాలి



**కరీంనగర్ టౌన్, జూన్25(ది క్రైమ్ న్యూస్):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)నగరంలోని 47 వ డివిజన్ లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు. అసలైన ఓటరు ఏఒక్కరికి అన్యాయం జరుగవద్దని మ్యాపింగ్ కాని ఓటర్ల నమోదుతో పాటు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ బిఎల్ఏ లు దగ్గరుండి చూసుకోవాలని మ్యాపింగ్ అయిన వారి ఎన్యుమరేషన్ పత్రాలు దగ్గరుండి నింపించి బి ఎల్ వో ద్వారా అప్ లోడ్ చేపించాలి ఎన్యూమరేషన్ ఫామ్ నింపించి ఇవ్వకపోతే డ్రాఫ్ట్ లిస్ట్ లో ఓటు నమోదు కాదు అందుకని తప్పకుండా ప్రతి ఎన్యూమరేషన్ ఫామ్ తప్పకుండా నింపించి ఇవ్వాలని బి ఎల్ ఏ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, బిఎల్ వో సునీత, బిఎల్ వో సూపర్ వైజర్ జమున, శ్రీనివాస్ గౌడ్, కేశవ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని మోసం ఆరు లక్షలు వసూలు

## న్యాయం చేసి డబ్బులిప్పించాలని బాధితుల వేడుకోలు




**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం: అబ్రాడ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆరు లక్షల వరకు వసూలు చేసి, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరిస్తున్న సలీం అనే వ్యక్తిపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని బాధితుడు సోందుమియా ఆవేదన వ్యక్తం చేశాడు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోందుమియా మాట్లాడుతూ ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన ఇమామ్ కొడుకు సలీం కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నాడని, తమకు తెలిసిన ఏజెన్సీకి డబ్బులు చెల్లిస్తే అబ్రాడ్ వెళ్లవచ్చని నమ్మబలికినట్లు తెలిపారు. తన అల్లుళ్లకు ఉద్యోగం వస్తుందనే ఆశతో సలీం చూపించిన కన్సల్టెన్సీ వారి ఖాతాకు తన సతీమణి పేరుతో ఎస్‌బిఐ బ్యాంక్ నుండి దఫాల వారీగా గబుదాబీ కమర్షియల్ బ్యాంక్ ఖాతా నెంబర్ ఏ ఇ 310030000499477208001కు ఇద్దరికి చొప్పున ఆరు లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఆరు నెలలైనా ఉద్యోగం ఇవ్వకపోవడంతో తమ డబ్బులు ఇవ్వాలని అడుగగా తనకు ఇవ్వలేదు, కన్సల్టెన్సీ వారిని అడగండి అంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు. కన్సల్టెన్సీ వారిని అడుగగా తమకేం సంబంధం లేదని, సలీంను అడగాలని చెప్పినట్లు తెలిపారు. ఇటీవలనే సలీమ్ ఖమ్మంవచ్చాడని, తాము నిలదీయగా మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమను మోసం చేసిన సలీమ్‌తో పాటు అతని తండ్రి ఇమామ్‌పై చర్యలు తీసుకుని తమ డబ్బుల్ని తమకు ఇప్పించాలని వేడుకున్నాడు. లేకుంటే తనకు చావే గతి అని, తాను వడ్డీకి అప్పుతెచ్చి డబ్బులు ఇచ్చినట్లు వాపోయాడు. ఈ సమావేశంలో సోందుమియా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మిరియాల నారాయణ గుప్తా జయంతి వేడుకలు



**మధిర ప్రతినిధి జూన్ 25 (ది క్రైమ్ న్యూస్):** మధిర మున్సిపాలిటీ పరిధిలో గల శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో గురువారం నాడు కీర్తిశేషులు మధిర గాంధీ బిరుదాంకితులు దేశభక్త, మిరియాల నారాయణ గుప్తా 133 వ జయంతి వేడుకలు కళ్యాణ మండపంలో శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపం అధ్యక్షుడు కురువెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి మిర్యాల నారాయణ గుప్తా గారి విగ్రహానికి పూల మాలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప ప్రధాన కార్యదర్శి నాళ్ళ శ్రీనివాసరావు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వార్డు కౌన్సిలర్లు, పలు పార్టీల రాజకీయ నాయకులు పాల్గొని మిరియాల నారాయణ గుప్తా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి మిరియాల నారాయణ గుప్త సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప సభ్యులు మాధవరపు నాగేశ్వరరావు, మిరియాల వెంకటరమణ గుప్తా, మిరియాల శేషగిరిరావు, వనమా వేణుగోపాలరావు (సూరి), పుల్లఖండం చంద్రశేఖర్, పుల్ల ఖండం సత్యనారాయణ మూర్తి, జగన్మోహన్రావు, నేరెళ్ల శ్రీనివాసరావు, కేతే పల్లిసతీష్, పెరుమాళ్ళ సత్యనారాయణ, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సూరంశెట్టి కిషోర్, కోనా ధని కుమార్, పాటిబండ్ల సత్యంబాబు, రంగా హనుమంతరావు, బెజవాడ రవి, శీలం నరసింహారావు, రంగా శ్రీనివాసరావు, పారుపల్లి విజయ్ కుమార్, తలుపుల వెంకటేశ్వర్లు, అద్దంకి రవికుమార్, కరివేద సుధాకర్ , రమణా నాయక్, బెజ్జం రాజు, ధారా నాగార్జున, బొల్లెద్దు విజయ్ కుమారి, దోర్నాల సునీల్ , ములకలపల్లి వినయ్ , వంకాయలపాటి బాబు, కోట డేవిడ్ , దోర్నాల మురళీకృష్ణ, టీవీ రెడ్డి, తోట సాయి, బండారు నరసింహారావు, యన్నం కోటేశ్వరరావు, మోదుగు బాబు ,తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో విద్యా నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మూడు నెలల్లో మౌలిక వసతుల సమస్యల పరిష్కారం.. ఇక విద్యా ఫలితాలే లక్ష్యం ● ఫిజిక్స్‌వాలా, అనఅకాడమీ వంటి డిజిటల్ లెర్నింగ్ యాప్‌ల వినియోగాన్ని పెంచాలి ● కేజీబీవీల్లో పెండింగ్ పనులు 3 నెలల్లో పూర్తి చేయాలి ● కేజీబీవీల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యా నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ తో కలిసి కేజీబీవీల నిర్వహణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించామని, అధిక శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. మరో మూడు నెలల్లో మిగిలిన మౌలిక వసతుల సమస్యలను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని, ఇకపై విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పరీక్షల ఫలితాల మెరుగుదలపై విద్యాశాఖ పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించకపోతే దానికి ఉపాధ్యాయులు, విద్యాశాఖ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కేజీబీవీల్లో విద్యార్థులు 24 గంటలు మన పర్యవేక్షణలోనే ఉంటారని, అందువల్ల గతంతో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో ఎక్కువ మంది విద్యార్థులు అత్యధిక మార్కులు, 10 జీపీఏ సాధించేలా లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు. ఫిజిక్స్‌వాలా, అనఅకాడమీ వంటి డిజిటల్ లెర్నింగ్ యాప్‌లను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఈ యాప్‌ల ద్వారా కేవలం 30 శాతం మాత్రమే విద్యార్థులు సమస్యలు పరిష్కరిస్తున్నారని, ప్రతిరోజూ అభ్యాసం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలోని ఏ కేజీబీవీలోనైనా సమస్యలు ఉంటే సమీక్ష సమావేశాల వరకు వేచి ఉండకుండా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. బోర్‌వెల్ మరమ్మతులు, తాగునీటి సమస్యలు, మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ల వంటి పెండింగ్ అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. కేజీబీవీల్లో ల్యాబ్‌లు, ఇతర విద్యా సదుపాయాలు అందుబాటులో ఉన్నందున విద్యార్థుల ప్రవేశాల పెంపు కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని కేజీబీవీల్లో మంజూరైన అభివృద్ధి పనులు అనవసరంగా ఆలస్యమవుతున్నాయని, కొన్ని పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి 3 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిసిడిఓ. కవిత సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక చేయూత

## ● పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని, అవసర సమయంలో ప్రభుత్వ సహాయం అందించడం వల్ల నిరుపేద కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికు దరఖాస్తు చేసుకున్న 58 మంది బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.43,07,500 ఆర్థిక సహాయ చెక్కులను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని, ప్రజాక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పేర్కొంటూ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. వైద్య చికిత్స కోసం సహకారం అందించిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజు, నాయకులు సంజీవ రెడ్డి, రఘునందన్ రెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, ఎండీ ఇబ్రహీం, మంత్రి ప్రగడ సత్యనారాయణ, చిరుమర్తి రాజు, మల్లయ్య, గోపాల్, తిరుపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న బీజేపీ నేత రవికుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో వెలసిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ హుడా కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను, కాలనీ ప్రజలను అభినందించారు. కోరిన కోరికలు తీర్చే శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆశీస్సులు ప్రతి ఇంటిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో జీవించాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సాంప్రదాయ విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అలాగే, ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా సమాజాన్ని ఒక్కతాటిపైకి తీసుకువచ్చే ఆధ్యాత్మిక కేంద్రాలని రవికుమార్ యాదవ్ అన్నారు. ఇలాంటి వార్షికోత్సవాలు యువతలో భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంచుతాయని తెలిపారు. భక్తులందరూ స్వామివారి ఆశీస్సులతో శాంతి, సౌభాగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పద్మ, నాయకులు విష్ణు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెల్ల జుట్టు నల్లగా మార్చడానికి హెన్నా అవసరం లేదు.. ఈ ఒక్కటి చాలు..!



తెల్లజుట్టును నల్లగా మార్చేందుకు రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్‌ను వాడుతుంటారు. కానీ ఈ రకమైన ఉత్పత్తులు మీ జుట్టును తాత్కాలికంగా నల్లగా చేసే రసాయనాలను ఉపయోగిస్తాయని, అవి దీర్ఘకాలంలో తీరని నష్టాన్ని కలిగిస్తాయని మీకు తెలుసా? అందుకే సహజసిద్ధంగా జుట్టును నల్లగా మార్చుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. అందుకు ఒక మంచి రెసిపీని కూడా సూచించారు. దానికోసం పెద్దగా కష్టపడనక్కర్లేదు కూడా. మన వంటింట్లో ఎప్పుడూ రెడీగా ఉండేదే.. అదే కాఫీపొడి. అవును, ఇది తెల్లజుట్టును నల్లగా మార్చడంలో అద్భుతంగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం. సహజంగా తెల్ల జుట్టును నల్లగా మార్చడానికి కాఫీ నుండి రంగును తయారు చేసుకోవచ్చు. దీని కోసం, రెండు పెద్ద చెంచాల కాఫీ పొడి, ఒక కప్పు కండీషనర్ తీసుకోండి. ఈ రెండింటినీ బాగా కలపండి. తర్వాత ఆ పేస్ట్‌ని జుట్టుకు బాగా పట్టించి గంటపాటు అలాగే ఉంచాలి. అప్పుడు మీ జుట్టును నీటితో మాత్రమే కడగాలి. షాంపూ వాడకూడదు. అలాగే మరో విధానంలో కాఫీపొడి తీసుకొని అందులో అలోవెరా జెల్ కలపండి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని జుట్టుకు పట్టించి గంటపాటు అలాగే ఉంచాలి. తర్వాత మీ జుట్టును సాధారణ నీటితో కడగాలి. ఇప్పుడు కూడా షాంపూ ఏమాత్రం ఉపయోగించకూడదు. కాఫీ తెల్లని జుట్టును నల్లగా మార్చడానికి చాలా బాగా పనిచేస్తుంది. ఇది హెన్నా కంటే ఎక్కువ ప్రయోజనకరం. కాఫీ మీ జుట్టుకు సహజంగా పోషణను అందిస్తుంది, ఇది జుట్టుకు అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. బ్రౌన్ కలర్ జుట్టు సహజంగా కూల్ గా కనబడేలా చేస్తుంది. కాఫీపొడితో మీ జుట్టు చక్కని మెరుపు సంతరించుకుంటుంది. కాఫీ లోపలి నుండి జుట్టుకు మెరుపు తెచ్చేలా పనిచేస్తుంది. దీనితో పాటు, ఇది తలలో కొల్లాజెన్‌ను పెంచుతుంది. కాబట్టి మెరిసే జుట్టు కావాలంటే కాఫీని ఇలా వాడండి. అంతేకాదు, కాఫీ జుట్టుకి మంచి కండీషనర్ కూడా. మీ జుట్టు లోపలి నుండి తేమగా ఉండేలా కాఫీ పనిచేస్తుంది. కాఫీలోని గుణాలు మీ జుట్టును సహజంగా సిల్కీగా చేస్తాయి. ఈ సూచనలు అన్నీ కేవలం మీకు అవగాహన కోసం మాత్రమే.. వీటిని ప్రయోగించేముందు నిపుణుల సలహాకూడా తీసుకుంటే మంచిది.

# ఖాళీ కడుపుతో ఈ నీళ్లు తాగండి.. దీని లాభాలు చూస్తే షాకవుతారు.!

బెండకాయ చాలా మందికి ఇష్టమైన కూరగాయ. దీంతో ఎన్నో రకాల వంటకాలు తయారుచేస్తాం. కొందరు పచ్చి బెండకాయలు కూడా తింటారు. అయితే బెండకాయను నీటిలో నానబెట్టి, ఆ నీటిని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. నాలుగు లేత బెండకాయలు తీసుకొని వాటిని శుభ్రంగా కడిగి, నిలువుగా, అడ్డంగా ముక్కలుగా కోసి మంచినీటిలో రాత్రంతా నానబెట్టి, ఉదయం ఆ నీటిని వడపోసి తాగాలి. దీంతో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు.. బెండకాయలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మాంగనీస్, విటమిన్ సి,బి, ఫోలిక్ యాసిడ్, పుష్కలంగా ఉంటాయి. ఇది ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే, ఫెన్నెల్ వాటర్ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి, జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది. బెండకాయలో మాంగనీస్ ఉంటుంది. ఇది జీవక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణకు కీలకమైన ఖనిజం. బెండకాయలో విటమిన్ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది. ఇది చర్మం వృద్ధాప్య ఛాయలు తగ్గిస్తుంది. మచ్చలు ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయ రోగనిరోధక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. బెండకాయలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కళ్లకు , ఎముకలకు బెండకాయ చాలా మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు బెండకాయ మంచి ఔషధం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బెండకాయలు నానబెట్టిన నీటిని తాగితే రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బెండకాయలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. పేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుచడంలో బెండకాయ సహాయపడుతుంది. బరువు తగ్గడానికి, రక్తపోటు నియంత్రణలో బెండకాయ సహాయపడుతుంది. ముఖ్య గమనిక ఏంటంటే ఇప్పుడు మనం చెప్పుకున్న విషయాలన్నీ కేవలం అవగాహన కోసం మాత్రమే.. వీటిని ప్రయోగించేముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.



# గుడ్లలో కంటే ఎక్కువ ప్రోటీన్ కావాలా..? అయితే ఈ పప్పులను తినండి.. ఇక నో టెన్షన్..



శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవడానికి విటమిన్లు, మినరల్స్‌తో పాటు ప్రోటీన్లు కూడా చాలా అవసరం. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ప్రోటీన్ సహాయపడుతుంది. అయితే, శరీర అభివృద్ధి నుంచి రోగనిరోధక శక్తిని పెంచడానికి ప్రోటీన్ తోపాటు విటమిన్లు చాలా సహాయపడతాయి. ప్రోటీన్ మూలాలలో ఒకటి గుడ్లు.. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ రోజుకు కనీసం 1 గుడ్డు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, తృణధాన్యాల్లో (పప్పులు) గుడ్లు కంటే ఎక్కువ ప్రోటీన్లు ఉంటాయి. అయితే, చాలామంది గుడ్లు తినరు లేదా మాంసాహారం తీసుకోరు.. అలాంటి వారికి ప్రొటీన్ లోపం ఉంటుంది.. అలాంటి వారు శరీరంలో ప్రోటీన్ స్థాయిలను నిర్వహించడానికి వారు పప్పులను తినవచ్చు. కొన్ని పప్పుల్లో గుడ్లు కంటే ఎక్కువ ప్రోటీన్లు ఉంటాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పప్పులలో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిని అన్నం లేదా రొట్టెలతో తినవచ్చు. పప్పు చాలా మందికి సులభంగా జీర్ణం కాదు. అలాంటప్పుడు పప్పు చారు తినడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పప్పు ఆరోగ్యానికి చాలా మంచిది. కందిపప్పు, మసూర్ పప్పు, పెసర పప్పులో గుడ్ల కంటే ఎక్కువ ప్రోటీన్లు ఉంటాయని చెబుతున్నారు. కాబట్టి తల్లులు, అమ్మమ్మలు ఉపవాసం ఉన్నప్పుడు, శనగపప్పు ఉడకబెట్టి తింటారు. తద్వారా శరీరంలో ప్రోటీన్ లోపం ఉండదు. ముఖ్యంగా పెసర పప్పు కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. కాబట్టి డైట్‌లో ఉన్నవారు కూడా పెసరపప్పు తింటే ప్రోటీన్ లెవెల్స్ అదుపులో ఉంటాయి జిమ్, యోగా లేదా ఇతర శారీరక శ్రమలలో పాల్గొనే వారికి పెసరపప్పు, కందిపప్పు, శనగల మొలకలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఇందులో అధిక ప్రోటీన్‌తో పాటు క్యాల్షియం, ఐరన్ తగినంత మొత్తంలో ఉంటాయి. ఇంకా వీటిని కూరగా లేదా.. ఉడకబెట్టుకుని కూడా తినవచ్చు.. అందుకే డైలీ ఒక కప్పు పప్పును తింటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# రొమాన్స్ పండు.. ఉదయాన్నే పరగడుపున తింటే ఆ సమస్యలకు చెక్ పెట్టినట్లే.. ట్రై చేయండి..



ప్రస్తుత కాలంలో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. కావున ఆరోగ్యంపై దృష్టిసారించడం మంచిది.. అందుకే ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి పండ్లలో కర్బూజ ఒకటి.. దీనిలోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. కర్బూజ పండులో నీటిశాతం ఎక్కువ.. కావున దీన్ని తినడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే, ప్రతి రోజూ ఉదయాన్నే కర్బూజ తినడం వల్ల చాలా వ్యాధులకు చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ముఖ్యంగా వేసవి కాలంలో కర్బూజను తినడం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. శరీరంలో నీటి కొరతను, పోషకాల కొరతను నివారించాలంటే దీనిని తప్పనిసరిగా తినాలి.. ముఖ్యంగా పరగడుపున (ఖాళీ కడుపుతో) తింటే చాలా మేలు జరుగుతుంది. కర్బూజ ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. కర్బూజను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం: కర్బూజను రోజూ తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. దీనిలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంద. ఇది మీ రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా సహాయపడుతుంది. రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో ఇది మీకు చాలా సహాయపడుతుంది. దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా ప్రయోజనాలను పొందవచ్చు. కడుపు సమస్యలు దూరం: వేసవి కాలంలో ప్రజలకు కడుపు సంబంధిత సమస్యలు మొదలవుతాయి. అజీర్తి, మలబద్దకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతుంటారు. అయితే, ఈ సీజన్‌లో ఎక్కువ నూనె, మసాలాలు తీసుకోవడం చాలా ప్రమాదకరం. కావున, అలాంటివి తగ్గించి.. తేలికపాటి వస్తువులను అంటే సులభంగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కావున కర్బూజను తినడం చాలా మంచిది. కంటి సంబంధిత సమస్యలు: కర్బూజ తినడం వల్ల కంటి సంబంధిత సమస్యలు కూడా నయమవుతాయి. విటమిన్ ఎ బీటా కెరోటిన్ కర్బూజలో లభిస్తుంది. ఇది మీ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా మీకు చాలా సహాయపడుతుంది. లైంగిక సమస్యల నుంచి ఉపశమనం: కర్బూజలోని విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. దీని వలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల లైంగిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.. వాటి నుంచి బయటపడేందుకు నిత్యం పలు రకాల మందులు వాడుతుంటారు. అలాంటి వారు రోజూ పుచ్చకాయను తీసుకుంటే.. కిడ్నీల్లో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు..

# ఒక్కటి.. ఒకే ఒక్కటి.. పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..?

అరటిపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. ఎప్పటికీ అందుబాటులో ఉండే అరటిపండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. అందుకే.. ఆరోగ్యానికి మేలు చేసే అరటిపండును తింటే.. శరీరానికి అనేక ప్రయోజనాలను కలుగుతాయని పేర్కొంటున్నారు.. అయితే, పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల నిద్ర, జీర్ణక్రియతోపాటు మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. నిద్రపోయే ముందు అరటిపండును తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా.. మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి నిద్రను నియంత్రించడంలో సహాయపడే న్యూరోట్రాన్స్‌మిటర్‌లు. కండరాల సడలింపు: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: పడుకునే ముందు ఒకటి తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే అవాంతరాలను నివారించవచ్చు. ఆకలి బాధను నివారిస్తుంది:అరటిపండ్లు ఫైబర్ కు మంచి మూలం.పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. నిరంతరాయంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.. అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

# స్పోర్ట్స్

# వన్డే ప్రపంచకప్ 2027లో రో-కో ఆడాలి



## సెలక్టర్లకు రవిచంద్రన్ అశ్విన్ సూచన

వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడటంపై వస్తున్న పుకార్లకు రవిచంద్రన్ అశ్విన్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. వీరిద్దరిపై పనిగట్టుకుని కొందరు నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డాడు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వచ్చే ప్రపంచకప్‌లో రో-కో కచ్చితంగా ఆడాలని స్పష్టం చేశాడు. అలాగే బీసీసీఐ సెలక్టర్లు కూడా వీరి భవితవ్యంపై ఇప్పుడే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే.. ఎలాంటి గందరగోళం లేకుండా వారు పూర్తి నమ్మకంతో టోర్నీకి సిద్ధమవుతారని అశ్విన్ సూచించాడు.టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ .. భవితవ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా రోహిత్, కోహ్లీ అడుగులు వేస్తున్నారు. కానీ వారు ఈ మెగా టోర్నీలో ఆడతారా.. లేదా అనే అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు. కొందరు.. రోకో ప్రపంచకప్ ఆడరని.. మరికొందరు ఆడాలని కామెంట్లు చేస్తున్నారు. ఇదే విషయంపై అశ్విన్ మాట్లాడాడు. వీరిపై సెలక్టర్లు వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాడు.ఇటీవల కాలంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి వస్తున్న వార్తలు బాలేవు. కొందరు పనిగట్టుకుని నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని గట్టిగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో మాత్రం అర్థం కావడంలేదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. మరికొందరు మాత్రం రో-కో ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఆడాలి" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో అశ్విన్.. భారత సెలక్టర్లకు కీలక సూచన చేశాడు. "దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు పూర్తి సన్నద్ధతతో, విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. మున్ముందు ఈ అంశం మరింత సంక్లిష్టంగా మారుతుంది. గందరగోళానికి దారి తీస్తుంది" అని రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. రోహిత్, కోహ్లీ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. రోహిత్ ఇటీవల అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో రాణించాడు. గాయం కారణంగా కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ పాల్గొనే అవకాశం ఉంది.



# శతకంతో చెలరేగిన సాయి సుదర్శన్

శ్రీలంక-ఏతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ ఓపెనర్ సాయి సుదర్శన్(175 బంతుల్లో 19 ఫోర్లతో 132) శతకంతో చెలరేగాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లల్లో 4 వికెట్లకు 333 పరుగులు చేసింది.సాయి సుదర్శన్‌తో పాటు కెప్టెన్ ధ్రువ్ జురెల్(138 బంతుల్లో 5 ఫోర్లతో 68 బ్యాటింగ్), తెలుగు తేజం షేక్ రషీద్(92 బంతుల్లో 4 ఫోర్లతో 53) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. శ్రీలంక-ఏ బౌలర్లలో సుదీర రెండు వికెట్లు తీయగా.. చామిక గుణశేఖర, రావిందు ఫెర్నాండో తలో వికెట్ తీసారు.గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, ఆయుష్ పాండే(25) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు. ఆయుష్ పాండేను తిలకరత్నే ఔట్ చేయగా.. దేవదత్ పడిక్కల్ సాయంతో సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అయితే పడిక్కల్(12) ఎల్బీగా వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడటంతో పరుగుల వేగం తగ్గింది. మూడో వికెట్‌కు 85 పరుగులు జోడించిన అనంతరం రుతురాజ్ గైక్వాడ్(22) ఎల్బీగా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా.. సాయి సుదర్శన్ శతకం పూర్తి చేసుకున్నాడు. సెంచరీ అనంతరం సాయి సుదర్శన్‌ను గుణశేఖర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు.తెలుగు తేజం షేక్ రషీద్‌తో కలిసి ఆచితూచి ఆడిన ధ్రువ్ జురెల్ మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించాడు. ఈ ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకోవడంతో ఐదో వికెట్‌కు అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదైంది.

# వైభవ్ సూర్యవంశీకి ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్

భారత సీనియర్ క్రికెట్ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల ఓపెనింగ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రానికి ముందే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. త్వరలో జరగబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో చోటు దక్కించుకున్న ఈ టీనేజ్ స్టార్, బ్రిటన్ పర్యటనలో ఒక వింతైన పరిస్థితిని ఎదుర్కోబోతున్నాడు. అతను మైనర్ (చిన్నపిల్లవాడు) కావడంతో అక్కడి 'మైనర్ల రక్షణ నిబంధనల' ( ప్రకారం అతనికి పర్యటన పొడవునా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. యునైటెడ్ కింగ్‌డమ్ క్రికెట్ నిబంధనల ప్రకారం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని 'అండర్-16' ఆటగాడిగా (మైనర్‌గా) పరిగణిస్తారు, పెద్దవాడిగా కాదు. బ్రిటన్ చట్టాల ప్రకారం మైనర్లయిన ఆటగాళ్లు వయసులో పెద్దవారైన మిగతా జట్టు సభ్యులతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లను గానీ, షవర్ (స్నానపు) గదులను గానీ పంచుకోవడానికి వీల్లేదు. ఇది ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యొక్క భద్రతా ఫ్రేమ్‌వర్క్‌లో ఒక భాగం. 16 ఏళ్ల లోపు ఉన్న ఆటగాళ్లు పెద్దలతో కలిసి ఒకే డ్రెస్సింగ్ రూమ్ వాడటాన్ని ఇది నిషేధిస్తుంది. స్వతంత్ర క్రికెట్ నియంత్రణ సంస్థ తో పాటు మ్యాచ్‌లు జరిగే స్టేడియాల సేఫ్‌గార్డింగ్ అధికారులు ఈ నియమాలను పర్యవేక్షిస్తారు. ఈ ఆంక్షలు ఉన్నప్పటికీ, వైభవ్ సూర్యవంశీ జట్టులోని మిగతా సభ్యులతో కలిసి టీమ్ మీటింగ్‌లు, వ్యూహాత్మక చర్చలు, వార్మ్-అప్ సెషన్లు, మ్యాచ్ రోజున జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ సాధారణంగానే పాల్గొంటాడు. ఈ పరిమితులు కేవలం మ్యాచ్ దుస్తులు మార్చుకునేటప్పుడు లేదా షవర్ ఉపయోగించేటప్పుడు మాత్రమే వర్తిస్తాయి. ఆ సమయంలో అతనికి కేటాయించిన ప్రత్యేక ప్రైవేట్ గదిని ఉపయోగించాలి. ఒకవేళ ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌ను ఉపయోగించాల్సి వస్తే, మిగతా ఆటగాళ్లు ఎవరూ లేని సమయంలో నిర్దేశిత టైంలో మాత్రమే అతనికి అనుమతి ఉంటుంది. భారత్-ఇంగ్లాండ్ సిరీస్ అనేది రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కానీ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే టోర్నమెంట్ కాదు. కాబట్టి ఈ విషయంలో ఐసీసీకి ఎలాంటి అధికారం ఉండదని నివేదికలు స్పష్టం చేశాయి. "ఈ సేఫ్‌గార్డింగ్ నిబంధనలు ద్వైపాక్షిక సిరీస్‌లకు వర్తించవు. భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ సిరీస్ ఐసీసీ ఈవెంట్ కాదు కాబట్టి అండర్-16 క్రికెటర్ల కోసం ప్రత్యేక ఐసీసీ రూల్స్ ఏవీ లేవు. ఇది పూర్తిగా యూకే దేశ చట్టం, ఇందులో ఐసీసీ జోక్యం చేసుకోలేదు" అని హిందుస్థాన్ టైమ్స్ పత్రిక ఒక అధికారిక ప్రతినిధి మాటలను ఉటంకించింది. భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇదే రకమైన నిబంధనలను పాటిస్తామని 'క్రికెట్ ఐర్లాండ్' స్పష్టం చేసింది. క్రికెట్ ఐర్లాండ్ ప్రతినిధి మాట్లాడుతూ.. "పెవిలియన్‌లో భారత జట్టు కోసం మూడు విడివిడి గదులను కేటాయించాం, అలాగే సేఫ్‌గార్డింగ్ చట్టాల గురించి వారికి వివరించాం. నిబంధనలన్నీ సక్రమంగా అమలు జరిగేలా మేము పర్యవేక్షిస్తాం, అయితే బీసీసీఐ కూడా యూకే చట్టాల ప్రకారం ఈ విషయాలను హ్యాండిల్ చేస్తుంది. మా విధానాలు బ్రిటన్ లోని ఉత్తమ పద్ధతులకు అనుగుణంగానే ఉన్నాయి" అని తెలిపారు. ఏదేమైనా ఒక అంతర్జాతీయ పర్యటనలో ఒక భారత ఆటగాడి కోసం ఇలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం క్రికెట్ చరిత్రలో చాలా అరుదైన విషయమనే చెప్పాలి.



# అక్షితా రాజ్‌తో ఆకాశ్ దీప్ వివాహం

భారత పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. తన పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అయితే పెళ్లిక హాజరైన ఓ అతిథి రోహిత్, కోహ్లీ, ధోనీని ఎందుకు పిలవలేదు అంటూ అడగ్గా.. ఆకాశ్ దీప్ చమత్కారంగా సమాధానమిచ్చాడు. వారణాసికి వాళ్లు వచ్చి ఉంటే పెళ్లి ఎవరైనా జరిగనిచ్చేవారా? అంటూ ఫన్నీగా చెప్పాడు. ప్రస్తుతం గాయాల భారిన పడ్డ ఆకాశ్ దీప్ జట్టులో చోటు కోల్పోయాడు.టీమిండియా పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల వారణాసిలో అంగరంగ వైభవంగా అక్షితా రాజ్‌ను వివాహం చేసుకున్నాడు. తన పెళ్లి వేడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అభిమానులు, టీమిండియా ఫ్యాన్స్ అందరూ ఆకాశ్‌కు కామెంట్స్ రూపంలో శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ఈ వివాహానికి హాజరైన ఓ అతిథి ఆకాశ్ దీప్‌ను ఓ ఆసక్తికర ప్రశ్న అడగ్గా, అంతకంటే ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చాడు ఆకాశ్ దీప్.విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీని వివాహానికి ఎందుకు ఆహ్వానించలేదంటూ ఒక అతిథిని ఆకాశ్ దీప్‌ను ప్రశ్నించాడు. దానికి ఆకాశ్ దీప్ సరదాగా స్పందిస్తూ వాళ్లు వస్తే ఇక్కడ వారణాసిలో పెళ్లి జరగనిస్తారా? అంటూ ఫన్నీగా జవాబిచ్చాడు. ధోనీ, విరాట్, రోహిత్ వంటి స్టార్ క్రికెటర్లు పెళ్లికి హాజరైతే భారీ సంఖ్యలో అభిమానులు తరలివస్తారు.. అప్పుడు పెళ్లి వేడుక ప్రశాంతంగా సాగదు కదా అన్న అర్థంలో ఆకాశ్ దీప్ చమత్కారంగా కామెంట్స్ చేశాడు. ఐపీఎల్‌లో గుర్తింపు తెచ్చుకున్న ఆకాశ్ దీప్, డొమెస్టిక్ క్రికెట్‌లోనూ రాణించి టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ముఖ్యంగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఆకాశ్ దీప్ అదే స్థాయిలో రాణించాడు. ఇప్పటి వరకు పది టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఆకాశ్.. 28 వికెట్లు పడగొట్టాడు. ఒక్క ఇన్నింగ్స్‌లో 6/60.. ఒక్క మ్యాచ్‌లో 10/112తో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. గతేడాది ఇంగ్లండ్ వేదికగా జరిగిన అండర్సన్ - టెండూల్కర్ సిరీస్‌లో బర్మింగ్ హామ్ టెస్టులో 12 వికెట్లు పడగొట్టి పేరు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఆకాశ్ దీప్‌ను దక్కించుకుంది. అయితే వెన్ను నొప్పి కారణంగా అతను సీజన్ మొత్తానికి దూరమవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదే కారణంతో టీమిండియాలోనూ చోటు కోల్పోయాడు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్న ఆకాశ్ దీప్.. ప్రస్తుతం పెళ్లి హడావుడిలో మునిగిపోయాడు. ఆకాశ్ దీప్ పెళ్లి ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.

# రోహిత్ శర్మ సక్సెస్ సీక్రెట్ ఇదే..

క్రికెట్ మైదానంలో పరుగుల వరద పారించే టీమిండియా స్టార్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ స్టైల్‌కు కోట్లాది మంది అభిమానులున్నారు. అయితే కఠోర శ్రమ, అద్భుతమైన ప్రతిభతో పాటు రోహిత్ సక్సెస్ వెనుక కొన్ని సీక్రెట్స్, నమ్మకాలు ఉన్నాయనే విషయం మీకు తెలుసా? ఆటగాళ్ల నమ్మకాలు.. హిట్‌మ్యాన్ సెంటిమెంట్లు..: క్రికెట్ ప్రపంచంలో ప్రతిభ ఎంత ముఖ్యమో.. అదృష్టం కూడా అంతే కీలకమని చాలామంది ఆటగాళ్లు నమ్ముతుంటారు. మైదానంలోకి అడుగుపెట్టే ముందు ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అలవాటు లేదా సెంటిమెంట్ ఉంటుంది. పూర్వకాలం నుంచి నేటి తరం ఆటగాళ్ల వరకు ఏదో ఒక నమ్మకాన్ని గుడ్డిగా అనుసరిస్తూనే ఉన్నారు. మన భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇందుకు మినహాయింపు కాదు. తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలు సాధించిన రోహిత్.. ప్రతి మ్యాచ్‌కు ముందు మూడు ప్రత్యేకమైన అలవాట్లను, సెంటిమెంట్లను తూచా తప్పకుండా పాటిస్తుంటారు.కాఫీ గ్లాసుతోనే రోహిత్ రోజు షురూ..: రోహిత్ శర్మ రోజువారీ జీవితంలో కాఫీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మ్యాచ్ ఉన్న రోజు ఉదయం నిద్ర లేవగానే హిట్‌మ్యాన్ కచ్చితంగా కాఫీ గ్లాసుతోనే తన రోజును ప్రారంభిస్తారు. ఉదయాన్నే కాఫీ తాగడం వల్ల ఆ రోజంతా తనకు ఎంతో అదృష్టం కలిసివస్తుందని రోహిత్ బలంగా నమ్ముతారు. మ్యాచ్ రోజుల్లో కాఫీ తాగడానికి ముందే టీ లేదా ఎలాంటి పండ్ల రసాలను ముట్టుకోవడానికి కూడా ఆయన ఇష్టపడరు. కేవలం వేడి వేడి కాఫీ మాత్రమే తన మానసిక స్థితిని మార్చి, మైదానంలో రాణించేలా చేస్తుందని రోహిత్ సెంటిమెంట్. భార్య రితికకు ఫోన్ కాల్.. విజయానికి అసలు మంత్రం..: మైదానంలో ఎంత ఒత్తిడి ఉన్నా.. టీమ్ మీటింగ్‌కు వెళ్లే ముందు రోహిత్ శర్మ తన భార్య రితికా సజ్దేకు కచ్చితంగా ఫోన్ చేస్తారు. రితికతో మాట్లాడటం రోహిత్‌కు మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, మైదానంలో భారీ స్కోర్లు సాధించడానికి ఒక అదృశ్య శక్తిలా పనిచేస్తుందని ఆయన భావిస్తారు. సాధారణంగా రితికా సజ్దే ప్రతి మ్యాచ్‌లోనూ స్టేడియంలో కూర్చుని రోహిత్‌ను ప్రోత్సహిస్తూ కనిపిస్తుంటారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆమెతో మాట్లాడటం హిట్‌మ్యాన్ విజయ రహస్యాల్లో అత్యంత ముఖ్యమైనది. కుడికాలే ముఖ్యం.. ఒత్తిడిని జయించే రహస్యం..: ఇక మూడవ, అత్యంత ఆసక్తికరమైన సెంటిమెంట్ ఏంటంటే.. రోహిత్ శర్మ బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి అడుగుపెట్టేటప్పుడు ఎల్లప్పుడూ తన కుడికాల్ని మొదట లోపల పెడతారు. ప్రపంచ క్రికెట్‌లో చాలా మంది దిగ్గజాలు ఈ కుడికాలి సెంటిమెంట్‌ను పాటిస్తారు.

# సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి నెయ్‌మర్

## స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం

2026 ఫిఫా ప్రపంచకప్‌లో ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. బ్రెజిల్ దిగ్గజ ఆటగాడు నెయ్‌మర్ జూనియర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టాడు. 2026 ఫిఫా ప్రపంచకప్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో నెయ్‌మర్ బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం సాధించి, టోర్నీలో నాకౌట్ దశకు దూసుకెళ్లింది. నెయ్‌మర్ 2023 అక్టోబర్ తర్వాత బ్రెజిల్ తరఫున మళ్లీ ఇప్పుడే మైదానంలోకి వచ్చాడు. ఆ సమయంలో ఉరుగ్వేతో జరిగిన ప్రపంచకప్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో అతనికి మోకాలికి తీవ్రమైన గాయం అయింది. ఆ తర్వాత ఇటీవలే పిక్క గాయం కూడా వేధించింది. దీంతో అతను దాదాపు రెండేళ్లపాటు ఆటకు పూర్తిగా దూరమయ్యాడు. ఇటీవల ఫిట్‌నెస్ సాధించిన నెయ్‌మార్ స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మథ్యూస్ కున్హా స్థానంలో మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ సమయంలో అభిమానుల కరతాళ ధ్వనులు ఈ మ్యాచ్‌కే హైలైట్. ఈ మ్యాచ్‌లో ఆడటం ద్వారా నెయ్‌మర్ తన అంతర్జాతీయ కెరీర్‌లో ఒక మైలురాయిని అందుకున్నాడు. ఇది అతనికి నాలుగో ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంట్. అంతకుముందు అతను 2014, 2018, 2022 ప్రపంచకప్ ఎడిషన్లలో ఆడాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ మొదటి నుంచీ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్రెజిల్ స్టార్ ప్లేయర్ వినీషియస్ జూనియర్ ఫస్ట్ హాఫ్‌లోనే రెండు సూపర్ గోల్స్‌తో మెరిశాడు. మ్యాచ్ ప్రారంభమైన 7వ నిమిషంలోనే జట్టుకు తొలి గోల్ అందించాడు. హాఫ్-టైమ్‌కు కొద్ది



నిమిషాల ముందు హెడర్ ద్వారా రెండో గోల్ చేసి బ్రెజిల్‌ను 2-0తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత సెకండ్ హాఫ్‌లో మథ్యూస్ కున్హా మూడో గోల్ సాధించడంతో బ్రెజిల్ 3-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ రెండు గోల్స్‌తో వినీషియస్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్‌లో బ్రెజిల్ ఆడిన మొదటి మూడు మ్యాచ్‌ల్లోనూ వరుసగా గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. గత 24 ఏళ్లలో ఏ బ్రెజిల్ ఆటగాడికీ ఇది సాధ్యం కాలేదు. దీనితో అతను 2002 ప్రపంచకప్‌లో ఈ ఘనత సాధించిన దిగ్గజాలు రొనాల్డో నజారియో, రివాల్డోల రికార్డును సమం చేశాడు. స్కాట్లాండ్‌పై విజయంతో బ్రెజిల్ జట్టు గ్రూప్-సిలో మొత్తం 7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ (సూపర్-16) దశకు అర్హత సాధించింది. ఇదే గ్రూప్ నుంచి మొరాకో జట్టు కూడా నాకౌట్‌కు చేరింది. ఫిఫా ప్రపంచకప్ 2026లో గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో ఉత్కంఠభరిత పోరు సాగింది. వ్యాంకోవర్ వేదికగా జరిగిన ఈ హోరాహోరీ సమరంలో స్విట్జర్లాండ్ 2-1 తేడాతో కెనడాపై ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో స్విట్జర్లాండ్ గ్రూప్ టాపర్‌గా నిలిచింది. అయితే ఓటమి పాలైనప్పటికీ కెనడా జట్టు తమ ఫుట్‌బాల్ చరిత్రలోనే తొలిసారిగా ప్రపంచకప్ నాకౌట్ దశకు అర్హత సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు ఢీ అంటే ఢీ అన్నట్లుగా ఆడాయి. కెనడా డిఫెండర్లు, స్విస్ ఆటగాళ్లు హోరాహోరీగా తలపడటంతో మొదటి హాఫ్ ముగిసే సమయానికి ఇరు జట్లు ఎలాంటి గోల్స్ సాంధించలేకపోయాయి. సెకండ్ హాఫ్ ప్రారంభమైన వెంటనే స్విట్జర్లాండ్ వ్యూహాన్ని మార్చింది. కేవలం ఒక్క నిమిషంలోనే స్విస్ ఆటగాడు రూబెన్ వర్గాస్ అద్భుతమైన ఫీల్డ్ మూవ్‌ను గోల్‌గా మలిచి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ షాక్ నుంచి కెనడా తేరుకోకముందే, 57వ నిమిషంలో కెనడా డిఫెన్స్ చేసిన పొరపాటును అనుకూలంగా మార్చుకున్న జోహాన్ మంజంబి లో-ఫినిష్‌తో బంతిని నెట్‌లోకి పంపి స్విట్జర్లాండ్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. రెండు గోల్స్ వెనుకబడిన కెనడా పుంజుకోవడానికి గట్టిగా ప్రయత్నించింది.

విశ్వజి



# దుర్వాసన దూరం..

గుట్కాలు తినేవారిలో, మద్య పానం-ధూమపానం చేసేవారిలో నోటి దుర్వాసన ఎక్కువగా కనిపిస్తుంది. దంతధావనం సరిగ్గా చేయపోయినా.. ఈ సమస్య వేధిస్తుంది. కానీ, కొందరిలో ఏ దురలవాట్లూ లేకపోయినా.. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసినా.. నోటి నుంచి చెడువాసన వస్తుంటుంది. ఇది నలుగురిలో తీవ్రమైన ఇబ్బందికి గురిచేస్తుంది. కాబట్టి, నోటి దుర్వాసనను దూరం చేసే కొన్ని ఇంటి చిట్కాలను నిపుణులు వివరిస్తున్నారు. నోటిలో పేరుకుపోయే బ్యాక్టీరియా, ఇతర ఆరోగ్య సమస్యలు.. నోటి దుర్వాసనకు ప్రధాన కారణాలు. కాబట్టి, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడంతోపాటు ఫ్లాస్ చేయడం, నాలుకపై బ్యాక్టీరియాను తొలగించుకోవడం ముఖ్యం. నోటి దుర్వాసనను కలిగించే బ్యాక్టీరియాను ఉప్పు నీటితో పుక్కిలించడం ద్వారా నిర్మూలించవచ్చు. బేకింగ్ సోడాలో యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దీనిని మౌత్ వాష్‌గా వాడితే మంచి ఫలితాలు ఉంటాయి. నోరు పొడిబారినా.. దుర్వాసన వేస్తుంది. కాబట్టి, ఈ సమస్య నుంచి బయట పడటానికి నీళ్లు ఎక్కువగా తాగండి. దాంతో, శరీరం హైడ్రేటెడ్‌గా ఉండి, నోటి ఆరోగ్యం బాగుంటుంది. శ్వాసను తాజాగా ఉంచడంలో తులసి, పుదీనా ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. రాత్రిపూట విధులు నిర్వహించే సమయంలో.. తులసి, పుదీనా ఆకులను నమలండి. ఆపిల్, క్యారెట్లు, పుచ్చకాయలు, పైనాపిల్ వంటి పండ్లు.. నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. నోటిలో బ్యాక్టీరియాను తొలగించడం, లాలాజల ఉత్పత్తిని పెంచడంలో ముందుంటాయి. అయినా.. సమస్య అలాగే ఉంటే దంతవైద్యులను సంప్రదించండి.

# నిద్ర రావట్లేదా?

వృద్ధుల్లో నిద్రలేమి సాధారణ సమస్యగా మారింది. నిద్ర మాత్రలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించినా.. తరచుగా వాడితే దుష్ప్రభావాల ప్రమాదం ఉంటుంది. ఇందుకు నిపుణులు సిఫారసు చేస్తున్న ఒక సులభమైన చిట్కా.. క్రమం తప్పని శారీరక శ్రమ. వయసు పెరిగేకొద్దీ.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. అదనంగా ఆర్థరైటిస్, గుండె సమస్యలు, మందుల వాడకం వంటివి నిద్రకు భంగం కలిగిస్తాయి. దాంతో పెద్దవాళ్లు నిద్రపోవడంలో ఇబ్బంది పడుతుంటారు. రాత్రిపూట తరచుగా మేల్కొంటూ ఉంటారు. ఫలితంగా జ్ఞాపకశక్తి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు లాంటి సమస్యలు ఎదురవుతాయి. వీటినుంచి బయటపడాలంటే.. వృద్ధుల్లో నిద్ర సమస్యలను నివారించాలి. అందుకు 'వ్యాయామం' చక్కని పరిష్కారం చూపుతుంది. వ్యాయామంతో నిద్ర... చిన్నచిన్న వ్యాయామాలతోనూ కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయిలు తగ్గుతాయి. దాంతో ఒత్తిడి, ఆందోళన దూరమవుతుంది. మనసు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది. వ్యాయామం.. జీవ గడియారాన్ని రీసెట్ చేస్తుంది. ముఖ్యంగా ఉదయంపూట ఆరుబయట నడక వల్ల.. శరీరానికి సహజమైన సూర్యకాంతి అందుతుంది. ఇది రాత్రిపూట మెలటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. మితమైన వ్యాయామంతో శరీరం ఆరోగ్యకరమైన రీతిలో అలసిపోతుంది. ఫలితంగా.. రాత్రిపూట మంచి నిద్రపట్టేస్తుంది. సాయంత్రాల్లో ఓ మోస్తరు యోగాసనాలు వేయడం వల్ల.. శరీరానికి తగినంత విశ్రాంతి లభిస్తుంది. రాత్రి గాఢనిద్రలోకి జారుకునేలా చేస్తుంది. నిరంతరం వ్యాయామం చేసే వృద్ధులు నాణ్యమైన నిద్రపోతారని ఇటీవలి అధ్యయనాలు వెల్లడించాయి. అయితే, పడుకునే రెండు గంటల ముందు వ్యాయామాలకు దూరంగా ఉండటమే మంచిది. వ్యాయామం.. కేవలం శారీరక ఆరోగ్యం కోసమే కాదు. ఇది పెద్దల్లో మనశ్శాంతిని పునరుద్ధరిస్తుంది.

# లైఫ్ ట్రాప్స్‌లో లవ్



ఈరోజుల్లో ప్రేమంటే? కాఫీ డేట్స్, రీల్స్, స్టోరీస్‌లో లవ్ వైబ్స్, షాపింగ్.. అంతేనా? నిజానికి బంధాలు అంత తేలికైనవి కావు. మీరు మనస్ఫూర్తిగా ఎవరినైనా ప్రేమిస్తే, ఆ బంధం మీకు సంతోషాన్ని ఇవ్వాలి. కానీ, కొన్నిసార్లు ప్రేమ పేరుతో విసిరే ఉచ్చులో మనం చిక్కుకుపోతుంటాం. పదేపదే మనకు సరిపోని వాళ్ల మాయలోనే పడిపోతుంటాం. అందుకు కారణం కూడా మన ఆలోచనలే కావడం విచిత్రం. మనలో కొన్ని 'లైఫ్ ట్రాప్‌లు' పనిచేస్తుంటాయి అని మీకు తెలుసా? బాల్యంలో మొదలయ్యే కొన్ని భావనలు పెద్దయ్యాక సంబంధాలను ప్రభావితం చేస్తాయి. డాక్టర్ జెఫ్రీ యంగ్ అనే సైకాలజిస్ట్ 'స్కీమా థియరీ'తో ఈ 'లైఫ్ ట్రాప్‌ల' గురించి ఏనాడో చెప్పారు. ఇవి మన ఆలోచనల్ని, నిర్ణయాల్ని ప్రభావితం చేస్తాయి. సరైన భాగస్వామిని ఎంచుకోవడంలో తప్పులు చేసేలా ప్రోత్సహిస్తాయి. చివరికి ఇంకేముంది హార్ట్‌బ్రేక్!! అమ్మాయిలు ముఖ్యంగా మూడు లైఫ్‌ట్రాప్‌ల వల్ల ఇబ్బందులు పడుతుంటారు. ఎమోషనల్ డిప్రివేషన్ (భావోద్వేగాల లేమి), అబాండన్‌మెంట్ (విడిచి వెళ్లిపోతారేమో అనే భయం), సెల్ఫ్ శాక్రిఫైస్ (స్వీయ త్యాగం). ఈ మూడు ధోరణుల వల్ల భాగస్వామి ఎంపికలో, ప్రేమను నిలబెట్టుకోవడంలో తప్పులు చేస్తుంటారు.

కావాల్సిన ప్రేమ దొరకదేమో?!

నాకు కావాల్సిన ప్రేమ దొరకడం లేదు!! వాళ్లు నన్ను ప్రేమించినా.. సరిగ్గా వ్యక్తపరచడం లేదు.. ఇలాంటి ఆలోచనలు మీలో ఉన్నాయా? చిన్నప్పుడు మీకు సరైన ఆప్యాయత దొరకలేదా? అమ్మానాన్నలు దూరంగా ఉన్నారా? వాళ్లు మీకు అన్నీ ఇచ్చినా, మీ మనసులో ఏం ఉందో అర్థం చేసుకోలేదా? అలాంటప్పుడు, మీరు భావోద్వేగాలు అంతగా వ్యక్తపరచని వ్యక్తులకే త్వరగా ఆకర్షితురాలు అవుతారు. చిన్నప్పటి నుంచి భావోద్వేగాల లేమితో సతమతమైన మీ మనసు.. మీ తరహా వ్యక్తిత్వం ఉన్నవారికే అట్రాక్ట్ అవుతుంది. కానీ, లేనిది వెతుక్కోవడమే కదా జీవితం! బాల్యం నుంచి దొరకని ఆప్యాయత భాగస్వామి నుంచి ఆశించడం తప్పు కాదు. కన్సర్న్ చూపించే వారిని కాదని, మీలా బోర్‌గా ఫీలయ్యే వాళ్ల వెంటపడితే.. చివరికి జీవితంలో భావోద్వేగాలు మృగ్యమైపోతాయి.

నన్ను వదిలేస్తారేమో?! ప్రేమించినవాడు వదిలేస్తాడేమో అన్న అనుమానం..

### వాళ్లు కాస్త దూరం జరిగినా ఆత్మరక్షణలో పడిపోవడం..

మీలో ఈ తరహా ఫీలింగ్స్ వస్తుంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. చాలామంది తల్లిదండ్రులు ఎప్పుడూ ఒకేలా ఉండరు. పిల్లలంటే ప్రేమ ఉన్నప్పటికీ%% పరిస్థితులను బట్టి వాళ్ల అభిమానం వ్యక్తమవుతూ ఉంటుంది. కొన్నిసార్లు అతి గారాబం చేయడం, కొన్నిసార్లు మరీ ఎక్కువ నిర్లక్ష్యం చేయడం లాంటి పరిస్థితులు ఎదుర్కొన్న ఆడపిల్లల ఆలోచన కాస్త చిత్రంగా ఉంటుంది. ప్రేమలో అడుగుపెట్టినప్పటి నుంచి అనుమానాలు వాళ్లను పీడిస్తూ ఉంటాయి. భాగస్వామి ఏ కొంచెం స్పందించకపోయినా.. అతిగా స్పందిస్తుంటారు. ఎప్పుడూ అతణ్నే అంటిపెట్టుకొని ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. మరింత గాఢమైన ప్రేమను ఆశిస్తూ ఉంటారు. ఈ భయం మీ నిబద్ధతను చూపించకపోగా, నిజమైన ప్రేమను కూడా అంగీకరించలేని పరిస్థితిలోకి నెట్టేస్తుంది.

ప్రాణం అయినా ఇస్తాను

నా భాగస్వామి సంతోషంగా ఉంటే చాలు.. వాళ్ల కోసంఏదైనా చేస్తాను..

పైకి చూస్తే ఇలా ఆలోచించడం గొప్ప విషయమే! ప్రేమంటే త్యాగమే!! కానీ, లవ్‌జర్నీలో ఇదో ప్రమాదకరమైన ట్రాప్. చిన్నప్పటి నుంచి ఇంట్లోవాళ్ల కోసం త్యాగాలకు అలవాటుపడిన ప్రాణమైతే మరీ ప్రమాదం. ఎదుటివ్యక్తిని సంతోషపర్చడానికి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడుతుండటం అలవాటుగా చేసుకుంటారు. ఇక ప్రేమించిన వ్యక్తి కోసం విపరీత త్యాగాలకు పాల్పడుతుంటారు. సరైనోడు అయితే త్యాగం చేసినా కొంత ఫర్వాలేదు. కానీ, మీ బలహీనతను అలుసుగా తీసుకునే బాపతు ప్రేమికుడు ఎదురుపడితే.. మీ త్యాగాలకు విలువ ఉండదు సరికదా, కొన్నిసార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి కూడా రావొచ్చు. ఈ త్యాగశీలురు తమ భాగస్వామి నుంచి కూడా అదే తరహా త్యాగాలను ఆశిస్తే%% మీ ప్రేమ మొగ్గలోనే వాడిపోవడం ఖాయం. జెన్-జీ అమ్మాయిలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రపంచంలో పెరుగుతున్నారు. వారికి బంధాలపై స్పష్టమైన అవగాహన ఉండటంలేదు. అపరిచితులతో తేలికగా కనెక్ట్ అవుతున్నారు. ఈ క్రమంలో బాల్యంలో ఎదురైన అనుభవాలు, మనసుకు తగిలిన గాయాలు.. ఈ సంబంధాలపై పడితే.. మరింత డేంజర్ జోన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాబట్టి, రిలేషన్‌లోకి ప్రవేశించడానికి ముందు.. మానసికంగా దృఢంగా ఉండాలి. ఎదుటివ్యక్తిని సరిగ్గా అంచనా వేయగలగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన ప్రేమను పొందే అవకాశాలు ఉంటాయి.

# జుట్టుకు మునగాకు!

మునగ ఆకుల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి అనేక శారీరక సమస్యలను దూరం చేస్తాయి. జుట్టు ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ముందుంటాయి. మునగాకులో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ బి6, సి, ఐరన్, జింక్, క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. అవన్నీ జుట్టు సమస్యలకు చక్కటిపరిష్కారం చూపుతాయి. మునగాకుతో హెయిర్ ప్యాక్స్ తయారుచేసుకొని వాడితే.. అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. తయారీ విధానం.. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ మునగాకు పొడి, టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకోవాలి. రెండిటినీ బాగా మిక్స్ చేసి.. కొద్దికొద్దిగా పెరుగు కలుపుతూ మెత్తని పేస్ట్ తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టేలా జుట్టుకు ప్యాక్ వేసుకోవాలి. అరగంట సేపు అలాగే ఉంచి.. గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అనేక ప్రయోజనాలు.. మునగాకులో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్ గుణాలు పుష్కలం. ఇవి జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. వెంట్రుకలు ఒత్తుగా పెరిగేందుకు సాయపడతాయి. ఇందులో ఉండే జింక్.. జుట్టు కుదుళ్లలోని సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది. దాంతో కుదుళ్లు తేమగా మారుతాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తరిమేస్తాయి. తెల్ల జుట్టు సమస్యకూ మునగాకు చక్కని పరిష్కారం. ఇందులో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్ సి.. వెంట్రుకలు నెరవడానికి కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. మునగాకులో ఉండే బెహెనిక్, ఓలియిక్ ఆమ్లాలు.. జుట్టు ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. కుదుళ్లలో ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యల్ని తగ్గిస్తాయి.



# మార్కెట్

## ముంబైలో టెస్లా తొలి షోరూం.. నెల అద్దె ఎంతో తెలుసా..?


ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత విపణిలోకి అడుగుపెట్టింది. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంఛ్ చేసింది. ఈ షోరూం కోసం బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకుంది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగానూ కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె (%వీశిత్ప్రశ్రీఎ =వత్%) చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం. మరోవైపు తొలిషోరూం కోసం టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ రెండో షోరూంను ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సమాచారం.




## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..

# 317 పాయింట్లు సెన్సెక్స్ జంప్..!

దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల తర్వాత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జూన్ నెలలో భారత దేశ ద్రవ్యోల్బణం 77 నెలల కనిష్ట స్థాయి 2.1శాతానికి తగ్గింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,233.16 ఫ్లాట్‌గా మొదలైంది. ఈ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 82,221.74 పాయింట్ల కనిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,743.62 పాయింట్లకు చేరింది. చివరకు సెన్సెక్స్ 317.45 పాయింట్లు పెరిగి 82,570.91 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 వద్ద ముగిసింది. అన్ని రంగాల సూచీలు ఫార్మా, ఆటో, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, అపోలో హాస్పిటల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను నమోదు చేశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎటర్నల్, టాటా స్టీల్ నష్టపోయాయి. విస్తరణ ప్రణాళిక నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేర్లు 5 శాతం పెరిగాయి. ర్యాలీస్ ఇండియా షేర్లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి. క్యూ 1లో లాభం దాదాపు రెట్టింపు అయిన విషయం తెలిసిందే. తేజస్ నెట్‌వర్క్స్ షేర్లు క్యూ 1లో నష్టాల నేపథ్యంలో షేర్లు 6 శాతం పడిపోయాయి. యూఎస్ పేటెంట్ సెటిల్‌మెంట్ లెక్సెల్వి ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో సన్ ఫార్మా షేర్లు దాదాపు 3శాతం పెరిగాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వే నుంచి ఆర్డర్లతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేర్లు 2 శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్ షేర్లు జూన్ త్రైమాసికంలో నికర లాభం 5శాతం పెరగడంతో షేర్లు 2 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 140 స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, నిప్పాన్ లైఫ్, హెచ్‌డీఎఫ్ ఏఎంసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, జిల్లెట్ ఇండియా, యూటీఐ ఏఎంసీ, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, అనుపమ్ రసాయనన్, లారస్ ల్యాబ్స్, ఈఐడీ ప్యారీ, గ్లోబల్ హెల్త్, సియట్, జేఎం ఫైనాన్షియల్ ఉన్నాయి.



# ఆంధ్రప్రదేశ్

## గర్ల్‌ఫ్రెండ్ మాట్లాడడం మానేసిందని..

### కర్నూలులో యువకుడి ఆత్మహత్య

కర్నూలు : కర్నూలు జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గోనెగొండ్ల మండలం ఆల్వాల గ్రామానికి చెందిన గాడిబండ బోయజు (24) కర్నూలు నగరంలోని అద్దె ఇంట్లో ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన కుటుంబ సభ్యులు, బంధువులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. బోయజు కొంతకాలంగా కర్నూలులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అయితే ఇటీవల తన స్నేహితురాలు ఫోన్‌లో మాట్లాడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిసింది. ఈ కారణంగానే అతను ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువకుడు ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ప్రేమ వ్యవహారం కారణంగా మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నాడా? లేదా మరే ఇతర కారణాలు ఉన్నాయా? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తుల వాంగ్మూలాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, సాంకేతిక ఆధారాలు, కాల్ రికార్డుల ఆధారంగా మరణానికి గల ఖచ్చితమైన కారణాలను నిర్ధారించనున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి బాధ్యతలు

### సాధారణ పరిపాలన శాఖలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియామకం

అమరావతి,జూన్ 25 : ఐఏఎస్ అధికారుల బదిలీల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి వై. శ్రీలక్ష్మికి ఎట్టకేలకు ప్రభుత్వం కీలక పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఆమెను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అధికారిక జీవోను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ బాధ్యతలను అదనపు ఇన్‌చార్జిగా నిర్వహిస్తున్న శంషేర్ సింగ్ రావత్ నుంచి వై. శ్రీలక్ష్మికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సాధారణ పరిపాలన శాఖలో కీలక పరిపాలనా బాధ్యతలు ఇకపై ఆమె పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ ఐఏఎస్ అధికారిణిగా గుర్తింపు పొందారు. ఆమెకు కీలక శాఖల్లో పనిచేసిన అనుభవం ఉంది. తాజాగా ప్రభుత్వం ఆమెకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొంది.

## సుచరిత నివాసంలో మరోమారు ఎసిబి సోదాలు

హైదరాబాద్,జూన్ 25 : శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత నివాసంలో మరోసారి ఏసీబీ సోదాలు చేపట్టింది. ఆదాయానికి మించిన ఆస్తుల కే సులో తనిఖీలు చేస్తోంది. ఆమెకు భారీగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గతంలో స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సుచరిత రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మే 26న తొలివిడత కింద రూ.2 లక్షల సొమ్మును ప్రైవేటు డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా పట్టుబడ్డారు. దీంతో సుచరితను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోనే మరోసారి ఏసీబీ సోదాలు కొనసాగిస్తోంది.

## స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

### అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

### కార్యకర్తలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

మంత్రాలయం,జూన్25 : మరో మూడు నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించాలని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరంలో తెదేపా శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. కర్ణాటకలోని హోసపేటెలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం సీఎం మాధవరం చేరుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రాలయం తెదేపా ఇన్‌ఛార్జ్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మన ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలి. తెదేపా నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారిని అక్కున చేర్చుకుంటా. ఓడిపోయిన వారిని పక్కన పెట్టేస్తా. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. మంత్రాలయం వైకాపా ఎమ్మెల్యే చిచ్చు పెడుతున్నారు.. ఆయనకు బుద్ధి చెబుతాం. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. అధికారం ఉంది కదా అని నేతలు ప్రజలకు అందుబాటులో లేకపోతే వారికి దూరమవుతారు. మంత్రాలయం తెదేపాలో అసమ్మతి, విభేదాలు లేకుండా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి గెలుపుకోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్‌లకు కృషి

### బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత వెల్లడి

అమరావతి,జూన్25 :రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్‌కు కృషి చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత తెలిపారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నట్టు చెప్పారు. కొత్తగా మరో 10 బీసీ గురుకులాలను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ పథకం ద్వారా ఆధునిక పరికరాలు అందజేసి, బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా బీసీల ఆత్మగౌరవాన్ని నిలిపేలా బీసీ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. చంద్రబాబు హయాంలోనే కాపులకు మేలు జరిగిందని సవిత తెలిపారు. 2014-19 మధ్య 13 జిల్లాస్థాయి కాపు భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్.. వాటిలో 9 భవనాలను, 487 మినీ కాపు భవనాలు రద్దు చేశారన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చారని, జగన్ ఆ రిజర్వేషన్లను కూడా రద్దు చేశారని మంత్రి తెలిపారు.

# వరుస భూకంపాలను డబ్లెట్ అంటారు

### ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు

### కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు



న్యూఢిల్లీ,జూన్25 : వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు. ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే పక్రియేనని జోన్స్ పేర్కొన్నారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా.. గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్‌లో 15 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు. చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డ్లబెట్'గా పిలుస్తున్నారు. వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

## ల్యాండ్ పూలింగ్ ప్లాట్లలో అభివృద్ధి పనులు

### రూ.426.46 కోట్ల వ్యయంతోమౌలిక సదుపాయాలు

అమరావతి,జూన్25: ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ఉండవల్లి జోన్-11 పరిధిలో ట్రంక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.426.46 కోట్ల వ్యయంతో భారీ మౌలిక సదుపాయాల పనులను చేపట్టనుంది. అమరావతి ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధికి అవసరమైన ఈ పనులను ప్యాకేజీ-38 కింద చేపట్టనున్నారు.ఈ ప్రాజెక్టు కింద రోడ్డు, డ్రైన్లు, సరఫరా, సెవరేజ్ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ సరఫరా, ఐసీటీ యుటిలిటీ డక్ట్లు, రీయూజ్ వాటర్ లైన్ నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్‌టీపీ ఏర్పాటు, అవెన్యూ ఎ÷-లాంటేషన్ పనులను ఈ ప్యాకేజీలో భాగంగా అమలు చేయనున్నారు ఎల్-1 బిడ్డర్‌గా ఎంపికైన ఎన్‌సీసీ లిమిటెడ్‌కు పనులను కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంచనా వ్యయం రూ.409.78 కోట్లు ఉండగా, 4.07 శాతం అధిక బిడ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ కాంట్రాక్ట్‌కు రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌ను నిర్దేశిరచింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి జూన్ 19న జరిగిన ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీర్మానం నెం.669/2026 ఆమోదం పొందింది. అనంతరం ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం.777ను జారీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది. పనుల అవార్డు జారీ చేసేందుకు ఏడీసీఎల్ సీఎండీకి అధికారాలను అప్పగించింది. ఉండవల్లి ప్రాంతంలో సమగ్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రాజధాని నిర్మాణానికి మరింత వేగం చేకూరనుంది. ఈ ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను ఏపీసీఆర్‌డీఏ సమకూర్చనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజధాని అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహారం

### బాలామృతంను ప్రారంభించిన ఎంపి కేశినేని చిన్ని

విజయవాడ,జూన్25 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహారాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో 'బాలామృతం'ని విజయవాడలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వీబీ జీరాంజీ మాదిరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పథకాలనే కొత్త పేర్లతో అమలు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. సమీక్ష సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ సమస్యలపైనా విస్తృతంగా చర్చించినట్లు ఎంపీ చిన్ని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన సమస్యలపై త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని ఎంపీ చిన్ని చెప్పారు. సమస్యల పరిష్కారంలో జిల్లా ఏపీలోనే ముందంజలో ఉందని ఆయన తెలిపారు. అయితే వివిధ శాఖల మధ్య సమన్వయం కొంతమేర లోపించడం వల్ల కొన్ని అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైల్వే నెట్‌వర్క్‌కు సంబంధించిన సమస్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, వాటి పరిష్కారంపై దృష్టి సారించినట్లు తెలిపారు. శాటిలైట్ రైల్వేస్టేషన్లతో పాటు కొండపల్లి ప్రాంతానికి కూడా త్వరలో బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. విజయవాడ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బుడమేరు గండి సమస్యపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎంపీ తెలిపారు. త్వరలోనే బుడమేరు సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలకు భిన్నంగా, బుడమేరు నిర్వాసితులకు తగిన పునరావాస సదుపాయాలు కల్పిస్తూ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

### క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్,జూన్25 : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్దం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు.

## ఎర్రచందనం దుంగల పట్టివేత

### టాస్క్‌ఫోర్స్‌ను అభినందించిన పవన్

### అసలు సూత్రధారులను పట్టుకోవాలని ఆదేశం


### అటవీ సంపద పరిరక్షణలో రాజీలేదని వెల్లడి

అమరావతి,జూన్25 : ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కృషి చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో రూ.2 కోట్ల విలువైన 109 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో రెడ్ శాండర్స్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నల్లాని నందకుమార్‌తో పాటు మరో ఇద్దరిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కేసులో పట్టుబడిన వారితోనే దర్యాప్తు ఆగిపోకూడదని, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. లటవీ సంపద పరిరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీపడేది లేదని స్పష్టం చేసిన ఆయన, ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక చర్యలను మరింత పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. స్మగ్లింగ్ ముఠాల కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, వాటి మూలాలను పూర్తిగా నిర్మూలించే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎర్రచందనం స్మగ్లింగ్ దాదాపు 70 శాతయి వరకు తగ్గినట్లు పవన్ పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎర్రచందనం అక్రమ రవాణాలో గణనీయమైన తగ్గుదల నమోదైందని డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో 90 శాతం మందికి పైగా శిక్షలు పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర సంపదగా భావించే ఎర్రచందనం సరిహద్దులు దాటకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పవన్ కళ్యాణ్ చెప్పారు. అంతర్రాష్ట్ర సమన్వయంతో స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లపై ఉక్కుపాదం మోపుతున్నామని, అటవీ సంపద పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఎర్రచందనం అక్రమ రవాణాపై మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు..

## 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్,జూన్25 : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించార ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశిరచిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్దరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశిరచిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.




# ధర్మన్‌లో రజనీ డాక్టర్ అవతారం

అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నారు. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా రజనీకాంత్ పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. రజనీ, కమల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత సినిమా రావడం విశేషం. ఈ చిత్రంలో సిమ్రన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం 'ది ఓజీ స్వాగ్' అనే క్యాప్షన్‌తో టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రజనీకాంత్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. డాక్టర్ కోట్‌లో స్టెతస్కోప్‌తో, సీరియస్ లుక్‌లో తలైవా లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్లే డాక్టర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో కనిపిస్తారని టాక్. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'ధర్మన్' త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. రజనీ మార్క్ యాక్షన్, డైలాగ్స్, ఎమోషన్‌తో పాటు సామాజిక అంశాలను టచ్ చేసే కథతో ఈ సినిమా రూపొందుతోందని తెలుస్తోంది.



# నా బాడీ నాష్టం అంటే.. వాడి కళ్లు వాడి ఇష్టం

## స్త్రీల వేషధారణపై పరిమితులు ఉండాలన్న సునీత

ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, మరియు సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు. ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నా ఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు. చుట్టూ ఉన్న పరిసరాలు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో చూసుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం బట్టలు లేదా సిగరెట్లు తాగడం ఈక్వాలిటీ కాదని, సమాజంలో లేదా ఒక ఇంట్లో ఒక మహిళ తన అభిప్రాయాన్ని చెప్తే, దానికి పురుషులు ఎంతవరకు విలువ ఇస్తున్నారు అనే దానిపై పోరాడాలని సునీత అభిప్రాయపడ్డారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై కూడా సునీత పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరి ఒపీనియన్ వాళ్లది.




# ఓజి -2 సీక్వెల్‌కు పవన్ రెడీ

## సోషల్ మీడియాలో స్పెషల్ వీడియో విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఓజీ 2' రానున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం గురువారం ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'గంభీర కథ సిద్ధమవుతోంది. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్ ఇచ్చారు. విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ స్క్రిప్ట్ గురించి చర్చిస్తున్న విజువల్స్ ఉన్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ 'నేను రెడీ' అని చెప్పడం నెటిజన్లను, మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతోంది. మొదటి భాగానికి సంగీత దర్శకుడిగా పని చేసిన థమన్ ఎస్ ఈ సీక్వెల్‌కు కూడా మ్యూజిక్ అందించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. 'ఓజీ' మొదటి భాగంలో చూపించిన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌ను ఈ సీక్వెల్‌లో మరింత పెద్ద స్థాయిలో, కొత్త కోణంలో చూపించనున్నారని టాక్. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్, 'ఓజీ 2' కోసం డేట్స్ కేటాయించడంతో అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.

# కలెక్షన్లు రాబడుతున్న మా ఇంటి బంగారం

## ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర మంచి ప్రదర్శన కనబరుస్తుంది. విడుదలైన తొలి వారంలోనే ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల కలయికతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ. 55.71 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. భారతదేశంలో రూ. 33.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేయగా, దేశీయ గ్రాస్ వసూళ్లు రూ. 38.36 కోట్లకు చేరుకున్నాయి. విడుదలైన ఆరో రోజున కూడా సినిమా మంచి వసూళ్లు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్ర జోరు కొనసాగుతోంది. విదేశీ మార్కెట్లలో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు ఓవర్సీస్‌లో ఈ చిత్రం రూ. 17.35 కోట్ల గ్రాస్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ రిపోర్టులు సూచిస్తున్నాయి.




# సందీప్ కిషన్ సూపర్ సుబ్బు

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక పల్లెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగుపెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది.







Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com